


తిరుమల లడ్డూ ప్రసాదంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన నెయ్యి కల్తీ అక్రమాల నుంచి తప్పించుకోవడానికే హెరిటేజ్‌పై నిందలు వేస్తున్నారు. శ్రీవారి ప్రసాద పవిత్రతను దెబ్బతీయడానికి ఎవరికీ అధికారం లేదు. సిట్ ఏర్పాటు చేస్తే సరఫరా చేసినది నెయ్యి కాదని తేలింది. ఆ తప్పును బయటపెడుతుంటే ఇతరులపై నెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


సోమవారం 23.02.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్


తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 307 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




## 'ఏఐ సమ్మిట్'తో దేశ కీర్తి ఉన్నత శిఖరాలకు

### 'మన్ కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోదీ




ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : రేడియో కార్యక్రమం మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఏఐ సమ్మిట్ సహా పలు కీలక అంశాల గురించి తన మనసులో భావాలను తాజా 131వ ఎడిషన్ కార్యక్రమంలో ప్రజలతో పంచుకున్నారు.
ఇటీవలే జరిగిన ఏఐ ఇంపాక్ట్ సదస్సుతో ప్రధాని తన ప్రసంగాన్ని ప్రారంభించారు. భారత సాంకేతిక రంగ అభివృద్ధిలో ఈ సదస్సు ఓ మేలి మలుపు అని అన్నారు. ఈ సదస్సులో తాను ప్రపంచస్థాయి టెక్ లీడర్స్, సీఈఓలను కలుసుకున్నట్టు తెలిపారు. భారత్‌లో జరుగుతున్న అనేక ఆసక్తికర సాంకేతిక అంశాల గురించి వారికి వివరించానని అన్నారు. పశు పోషణ, వ్యవసాయ రంగంలో ఏఐ సాంకేతికతను ఎలా ఉపయోగిస్తున్నదీ వివరించానని అన్నారు. ఏఐతో రైతులు తమ పశు సంపద, పంటలను నిరంతరం ఓ కంట కనిపెట్టుకుని ఉండగలుగుతున్నారని తెలిపారు.
భారత తయారీదార్లు, స్టార్టప్ సంస్థలు నాణ్యమైన వస్తువుల తయారీపై దృష్టిపెట్టాలని అన్నారు. వంకపెట్టడానికి వీలులేని వస్తుసేవలతో అంతర్జాతీయ స్థాయిలో గౌరవ మన్ననలను పొందాలని సూచించారు. సృజనాత్మకతకు కేంద్రంగా దేశాన్ని నిలపాలని తెలిపారు. మిగతా 2లో...

# ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ హై స్పీడ్ ఇంటర్నెట్

- టెక్నాలజీతో పౌర సేవలు సులభతరం
- అంతర్జాతీయ స్థాయి విజ్ఞానాన్ని గ్రామీణ ప్రాంతాలకు చేరేలా చూడాలి
- ఏఐతో మరిన్ని ఉద్యోగాలు వచ్చేలా యువతలో నైపుణ్యం పెంచుతున్నాం
- ఇన్నోవేషన్లకు ఏపీ టెస్ట్ బెడ్
- గత ప్రభుత్వం ఫైబర్ నెట్ వ్యవస్థను నాశనం చేసింది
- రూరల్ డిజిటల్ కనెక్టివిటీపై జరిగిన ఎంఓసీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక సహకార ఒప్పందం

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. టెక్నాలజీ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవేయాలంటే ప్రతి ఇంటికీ డిజిటల్ కనెక్టివిటీ ముఖ్యమని సీఎం వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆదివారం సీఎం క్యాంప్ కార్యాలయంలో కీలక సహకార ఒప్పందం కుదిరింది. సుమారు 5 లక్షల గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లకు ఫైబర్ కనెక్షన్లు అందించే లక్ష్యంతో అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్ట్-ఏబీఎన్‌పీ అమలు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఏపీలో ఏబీఎన్‌పీ అమలుకు రూ. 2,432 కోట్ల మేర నిధుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఏబీఎన్‌పీ కోసం ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్.పీ.వీ ఏర్పాటు చేసింది. డిజిటల్ భారత్ నిధి-రాష్ట్ర ప్రభుత్వం పరస్పర అంగీకారంతో నిధులు సమకూర్చి ప్రాజెక్టు అమలు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. సీఎం చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో డిజిటల్ భారత్ నిధి-ఏపీ ప్రభుత్వం మధ్య ఎంఓసీ కుదుర్చుకున్నారు. మిగతా 2లో...



## దేశానికి కీలకమైన లాజిస్టిక్స్ వ్యవస్థ డాక్ సేవక్‌లే

**టెక్నాలజీ ఎంత పెరిగినా గ్రామీణ డాక్ సేవక్‌ల స్థానం భర్తీ కాదు**

**ఎలక్ట్రిక్ సైకిళ్లు ఇచ్చి వారికి మరింత సదుపాయం కల్పించాలి**

**డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే దేశంలో డబుల్ స్పీడ్‌తో అభివృద్ధి**

**గుంటూరులో గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

2లో

## కాంగ్రెస్ మురికి రాజకీయాలతో దేశానికి అప్రతిష్ఠ



మేరఠ్(జర్నలిస్ట్ ఫైల్) : ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమిట్‌లో శుక్రవారం యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్నంగా నిరసన చేపట్టడాన్ని ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. గ్లోబల్ ఈవెంట్ ఏఐ సమిట్‌ను కాంగ్రెస్ తన మురికి రాజకీయాలకు వేదికగా మార్చుకుందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. యూపీలోని మేరఠ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఏఐ సమిట్‌లో విదేశీ అతిథులు కూర్చున్న వేదిక వద్దకు కాంగ్రెస్ నాయకులు అర్ధనగ్నంగా వచ్చి గందరగోళం సృష్టించారని తెలిపారు. తమ చర్యలతో కాంగ్రెస్ నేతలు ఇప్పటికే ప్రజల దృష్టిలో దిగజారారని.. ఇంకా ఇటువంటి పనులు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దేశాన్ని అప్రతిష్ఠపాలు చేసే పనిలో కాంగ్రెస్ తీరిక లేకుండా ఉందని విమర్శించారు.
రాజకీయాలకు అతీతంగా జాతీయ ప్రయోజనాల కోసం చేపడుతున్న కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఈవిధంగా ప్రవర్తించడం సిగ్గుచేటని ప్రధాని విమర్శించారు. రాజకీయ విభేదాల కంటే వారు మిగతా 2లో...

## పవన్ కళ్యాణ్ చొరవతో కొణిదెల గ్రామానికి మహర్దశ

- రూ. 50 లక్షల విరాళంతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం
- తీరనున్న కొణిదెల గ్రామ దాహార్తి
- పల్లె పండగ, సాస్కీ, గ్రామీణ రహదారి సబ్ ప్లాన్ ద్వారా రూ. 6 కోట్లతో పలు అభివృద్ధి పనులు
- ఎన్నికల ముందు కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటించిన ఉప ముఖ్యమంత్రివర్యులు



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ చొరవతో నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండల పరిధిలోని కొణిదెల గ్రామానికి మహర్దశ పట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టితో ఆ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నారు. రూ. 50 లక్షల విరాళం అందించి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. దీంతోపాటు పల్లెపండగ 1.0, పల్లెపండగ 2.0, సాస్కీ, గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ తదితర పథకాల ద్వారా వచ్చిన నిధులతో రోడ్లు, డ్రెయిన్లు, కాలువల అభివృద్ధి... గోకులాలు, ఇళ్ల నిర్మాణం తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. కేవలం ప్రభుత్వ పథకాల నుంచే ఇప్పటి వరకు సుమారు రూ. 6 కోట్లకు పైగా నిధులు కొణిదెల గ్రామాభివృద్ధికి వెచ్చించారు.
2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో ఉండగా తమ గ్రామాన్ని దత్తత తీసుకోవాలని కొణిదెల గ్రామానికి చెందిన కొందరు పవన్ కళ్యాణ్‌ని కోరారు. తన ఇంటి పేరుతో ఉన్న కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకుంటానని ఆ సందర్భంలో ఆయన హామీ ఇచ్చారు. గత ఏడాది నందికొట్కూరు నియోజకవర్గంలో ఫారం పాండ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్లిన సందర్భంలో ఇచ్చిన మాట ప్రకారం ఆ గ్రామాభివృద్ధికి రూ. 50 లక్షల విరాళం అందజేశారు. ఈ నిధులతో గ్రామానికి అవసరం ఉన్న అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. మిగతా 2లో...

## తొలి హైస్పీడ్ మెట్రోను ప్రారంభించిన ప్రారంభించిన మోదీ



లక్నో(జర్నలిస్ట్ ఫైల్) : ఉత్తరప్రదేశ్‌లో నమో భారత్ ట్రైన్ సర్వీస్, మీరట్ మెట్రో ట్రైన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారంనాడు ప్రారంభించారు. శతాబ్ది నగర్ నమో భారత్ స్టేషన్ నుంచి ఈ సర్వీసులను జెండా ఊపి ప్రధాని ప్రారంభించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా పాల్గొన్నారు. అనంతరం శతాబ్ది నగర్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకూ మీరట్ మెట్రోలో మోదీ, ఆదిత్యనాథ్ కలిసి ప్రయాణించారు.
**నూతన విప్లవం :** రైలు సర్వీసులను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్, అభివృద్ధి భారత్ దిశగా నూతన విప్లవం ఈరోజు ఊపందుకుందని, తొలిసారి ఒకే ప్లాట్‌ఫాం నుంచి ఒకేరోజు నమో భారత్ ర్యాపిడ్ రైలు, మెట్రో రైలు ప్రారంభమయ్యాయని అన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పనితీరు తనకెంతో సంతృప్తి నిచ్చిందని, బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం పని సంస్కృతిని ఇవాల్టి కార్యక్రమం ప్రతిబింబిస్తుందని చెప్పారు. శంకుస్థాపన రాయి పడినప్పటి నుంచి రేయింబవళ్లు పనిచేసి ప్రాజెక్టును పూర్తి చేయడమే తమ వర్క్ కల్చర్ అని వివరించారు.
మెట్రోలో ప్రయాణం అనంతరం మొహియిద్దీన్‌పూర్‌కు మోదీ వెళ్లారు. అక్కడి బహిరంగసభలో పాల్గొన్నారు. పశ్చిమ యూపీలో మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి, ప్రజాపనులకు సంబంధించి రూ. 12,930 కోట్ల విలువచేసే పలు అభివృద్ధి ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేశారు.
**నమోభారత్, మీరట్ మెట్రో :** ఢిల్లీ-మీరట్‌ను అనుసంధానించే నమో భారత్ రైలు గంటకు 180 కిలోమీటర్ల వేగంగా ప్రయాణిస్తుంది. ఇది దేశంలోనే తొలి ప్రాంతీయ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టీఎస్). మీరట్ మెట్రో కూడా ఇదే ట్రాక్? మీద ప్రయాణిస్తుంది. ఇండియాలోనే ఫాస్టెస్ట్ మెట్రో సిస్టమ్‌గా గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించి అరగంటలో గమ్యం చేరుతుంది. ఈ కారిడార్ ఎన్‌సీఆర్‌లోని కీలక నివాస, వాణిజ్య, పారిశ్రామిక హబ్‌లను కలుపుతుంది. సరాయ్ కలే ఖాన్, ఆనంద్ విహార్, ఘజియాబాద్, గుల్దర్, మురదన్‌నగర్, మోదినగర్, మీరట్ సౌత్‌ల మీదుగా ప్రయాణం సాగిస్తుంది. ఢిల్లీ, ఘజియాబాద్, మీరట్, చుట్టుపక్కల ప్రాంతాలైన ఫరీదాబాద్, గురుగామ్, నొయిడాలోని లక్షలాది ప్రయాణికులకు ఈ ప్రాజెక్టు వల్ల ప్రయోజనం చేకూరుతుంది. స్టేషన్ల సమీపంలో ఇప్పటికే రియల్ ఎస్టేట్ పెరిగిందని, ఇక్కడి భూముల ధరలు గత రెండేళ్లలో 30 నుంచి 67 శాతం పెరిగాయని ఎన్‌సీఆర్‌టీసీ అధికారులు తెలిపారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా మీరట్, ఘజియాబాద్, మురద్‌నగర్, మోదీనగర్‌లలో కొత్త రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్టులను ఇప్పటికే బిల్డర్లు ప్రారంభించారు.

## మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా విడుదల



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద మరణించిన 95 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా సహాయం విడుదల చేసినట్లు వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. 2018 సంవత్సరం నుండి వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న ఈ కేసులను ప్రత్యేకంగా పరిశీలించి, మొత్తం రూ. 4.75 కోట్లు మంజూరు చేసి విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ పెండింగ్ ఫైళ్లను వేగవంతంగా పరిష్కరించి, 95 మంది లబ్ధిదారులలో 90 మంది కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో ఎక్స్‌గ్రేషియా మొత్తాలు జమ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన 5 మంది లబ్ధిదారుల ఖాతా వివరాల్లో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా జమ ప్రక్రియ పూర్తికాలేదని, వాటిని త్వరితగతిన పరిష్కరించి మొత్తాలను వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, బాధిత కుటుంబాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహాయం అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

### నేతన్నకు వెంకన్న దీవెన...

## ఆప్కోతో టీటీడీ ఒప్పందం

- ఆర్డర్ జారీచేసిన టీటీడీ మార్కెటింగ్ అధికారులు
- కండువాలు, దుశ్శాలువాలు, ఇతర వస్త్రాల పంపిణీ చేయాలని ఆర్డర్
- ఆప్కో చరిత్రలో తొలిసారి టీటీడీ ఆర్డర్ రాక
- నేతన్నలకు 365ల రోజుల ఉపాధి కల్పనలో మరో ముందుడుగు
- చేనేతలకు మేలు కలిగేలా టీటీడీ ఆర్డర్ : మంత్రి సవిత హర్షం
- టీటీడీ పాలకమండలికి ధన్యవాదాలు తెలిపిన మంత్రి



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : చేనేత రంగ అభివృద్ధికి, ఆప్కో బలోపేతానికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. నేతన్నలకు 365 రోజులు ఉపాధి కల్పన లక్ష్యంగా పలు సంస్థలతో ఆప్కో ఒప్పందం చేసుకుంటోంది. దీనిలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)తోనూ ఆప్కో ఒప్పందం చేసుకుంది. కలియుగ దైవం తిరుమల తిరుపతి వెంకన్న స్వామిని దర్శించుకునే భక్తులకు వేదాశీర్వచనంలో అందజేసే కండువాలు, దుపట్టాలు, కాటన్ బ్లౌజ్ లు టీటీడీకి సరఫరా చేయడానికి ఆప్కో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు టీటీడీ మార్కెటింగ్ శాఖ నుంచి ఆర్డర్ కాపీ ఆప్కోకు వచ్చింది. టీటీడీ నుంచి ఆప్కోకు ఇటువంటి ఆర్డర్ ఇదే మొదటిసారి కావడం విశేషం.

### నెయ్యి నాణ్యతను గుర్తించేందుకు

## ఫ్రాన్స్ నుంచి ఈ-టంగ్ అండ్ ఈ-నోస్ యంత్రాలు

- తిరుమలలో రూ. 25 కోట్లతో ఏర్పాటువుతున్న అత్యాధునిక ఫుడ్ ల్యాబ్ కు ఫ్రాన్స్ నుంచి దిగుమతి
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : తిరుమలలో అత్యాధునిక ఫుడ్ ల్యాబొరేటరీ సేవలు త్వరలో అందుబాటులోనికి తీసుకురాబోతున్నామని రాష్ట్రవైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. భక్తులకు సురక్షితమైన, మంచి నాణ్యత కలిగిన ప్రసాదాలు, ఆహారం అందించేందుకు వీలుగా ఈ ల్యాబ్ను అత్యాధునిక పరికరాలు/యంత్రాలతో సిద్ధం చేస్తున్నారు. రూ. 25 కోట్లతో ఏర్పాటవుతున్న ఈ ల్యాబ్లో స్వామి వారి ప్రసాదాల తయారీకి ఉపయోగించే నెయ్యి, జీడిపప్పు, కిస్మిస్, బాదంపప్పు, శనగలు, చక్కెర, యాలకులు, పసుపు, కారం వంటి ఆరవై రకాల ముడిసరకులు, ప్రసాదాల నాణ్యతను పరీక్షిస్తారని చెప్పారు. తిరుమలలోని ఫుడ్ ల్యాబ్రేటరీ ఏర్పాటు పనులు 90% వరకు పూర్తయ్యాయని మంత్రి చెప్పారు. ఈ ల్యాబ్ కార్యకలాపాలు వచ్చేనెల నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించారు. కల్తీని నెయ్యిని దృష్టిలో ఉంచుకుని ఈ ల్యాబ్లో ప్రత్యేకంగా ఈ-టంగ్ అండ్ ఈ- నోస్ (ఎలక్ట్రానిక్ నోరు- ఎలక్ట్రానిక్ ముక్కు) మిషన్లను రూ. 3.5 కోట్ల వ్యయంతో సమకూర్చబోతున్నామని పేర్కొన్నారు. నెయ్యి నాణ్యతలో అత్యంత సూక్ష్మస్థాయిలో లోపం ఉన్నా... ఈ-టంగ్ అండ్ ఈ-నోస్ యంత్రాలు పసిగడతాయని తెలిపారు. ఇవి అందుబాటులోనికి తెచ్చేందుకు మే వరకు సమయం పట్టే అవకాశం ఉందని సూత్రప్రాయంగా మంత్రి సత్యకుమార్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. మిగతా 2లో...



## 'ప్రసాద్' పథకం పరిధిలోకి కాణిపాక ఆలయాన్ని తెస్తాం

కాణిపాకం(జర్నలిస్ట్ ఫైల్) : పర్యాటక, ఆలయాల అభివృద్ధి కోసం కేంద్రం ప్రవేశపెట్టిన 'ప్రసాద్' పథకం పరిధిలో కాణిపాకం ఆలయాన్ని చేర్చేందుకు తన వంతు కృషి చేస్తానని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారిని మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌తో కలిసి ఆయన దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న కేంద్ర మంత్రికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, ఆలయ ఛైర్మన్, ఈవో, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, ప్రపంచస్థాయి పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా మారిందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. భగవంతుడి ఆశీస్సులు కూటమి ప్రభుత్వంపై ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

## 'ఏఐ సమ్మిట్'తో దేశ కీర్తి ఉన్నత శిఖరాలకు



(మొదటి పేజీ తరువాయి)

భారతీయ యువత, ఇన్నోవేటర్స్, వ్యాపారవేత్తలకు ఆ శక్తి ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు.

అవయవ దానానికి ముందుకొచ్చే వారిపై కూడా ప్రధాని ప్రశంసలు కురిపించారు. ఇటీవల మరణించిన కేరళ చిన్నారి ఆలిన్ షేరిన్ అబ్రహామ్‌ను గుర్తు చేశారు. మరణించిన తమ బిడ్డ అవయవాలతో ఇతరులకు ప్రాణదానం చేసినందుకు ఆలిన్ తల్లిదండ్రులను అభినందించారు. 10 నెలల వయసున్న ఆలిన్ ఇటీవల జరిగిన యాక్సిడెంట్‌లో తీవ్ర గాయాలపాలై కన్నుమూసిన విషయం తెలిసిందే. తల్లిదండ్రులు ఆమె అవయవదానానికి అంగీకరించడంతో దేశంలోనే అత్యంత పిన్న వయసు అవయవదాతగా ఆలిన్ నిలిచింది.

ఇక వలస సంస్కృతి, చిహ్నాలను వదిలిపెట్టి భారతీయత వైపు మళ్లాలని ప్రధాని మోదీ తన ప్రసంగంలో సూచించారు. గతంలో ఎర్ర కోట వద్ద తను చేసిన ఆజాదీ కీ అమృత్ మహోత్సవ్ ప్రసంగాన్ని గుర్తు చేశారు. బానిస మనస్తత్వాన్ని వీడి ఆలోచనల్లో స్వతంత్రతను సాధించాలని పిలుపునిచ్చారు. డిజిటల్ అక్షరాస్యత, సైబర్ సెక్యూరిటీ ఆవశ్యకత గురించి కూడా ప్రధాని పేర్కొన్నారు. డిజిటల్ వేదికల వినియోగంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిజిటల్ అంశాలపై అవగాహన పెరుగుతున్నా ఆన్‌లైన్ మోసాలు ఎక్కువవుతున్న వైనంపై ప్రజలను అప్రమత్తం చేశారు. కేవైసీ నిబంధనలు, ఇతర డిజిటల్ అంశాల గురించి అవగాహన పెంచుకోవాలని అన్నారు.

ఏఐడీఎమ్‌కే దివంగత నేత, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితను కూడా ప్రధాని మంత్రి ప్రశంసించారు. ఫిబ్రవరి 24న జయలలిత జయంత్యుత్సవం నేపథ్యంలో ఆమెకు నివాళులు అర్పించారు. ఆమె తన జీవితాన్ని ప్రజాక్షేమానికి అంకితం చేశారని అన్నారు. తమిళనాడు ప్రజల మనసుల్లో ఆమె చిరస్థాయిగా నిలిచిపోయారని కీర్తించారు.

## పవన్ కళ్యాణ్ చొరవతో కొణిదెల గ్రామానికి మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా జిల్లా అధికారులు గ్రామంలో తాగునీటి సమస్యను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా యంత్రాంగం సూచన మేరకు తానిచ్చిన రూ. 50 లక్షలతో కొణిదెల గ్రామంలో 90,000 లీటర్ల రక్షిత తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. ఈ ట్యాంక్ కొణిదెల గ్రామం పరిధిలో 2 వేల మంది దాహార్తి తీర్చనుంది. వేసవికి ముందే ఈ ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కావడం పట్ల ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు. సకాలంలో నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరించిన జిల్లా అధికార యంత్రాంగానికి, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

**సుమారు రూ. 6 కోట్ల నిధులతో సర్వతోముఖాభివృద్ధి :** కొణిదెల గ్రామానికి పల్లెపండగ 1.0లో సుమారు రూ. 20 లక్షలకు పైగా నిధులు వెచ్చించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన మూడు అంతర్గత రహదారుల నిర్మాణం పూర్తయ్యింది. పల్లెపండగ 2.0లో రూ. 45 లక్షల అంచనా వ్యయంతో ఏడు సీసీ రోడ్లు మంజూరు చేశారు. ఈ పనులు పురోగతిలో ఉన్నాయి. వీటితో పాటు గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ నిధులతో కొణిదెల గ్రామంలోని జిల్లా పరిషత్ స్కూల్ నుంచి పగిద్యాల మండల పరిధిలోని లక్ష్మాపురం వరకు 5 కిలోమీటర్ల మేర బి.టి. రోడ్డు నిర్మాణానికి రూ. 4 కోట్లు, ఆర్ అండ్ బి రోడ్డు నుంచి కొణిదెల గ్రామం వరకు ఉన్న రోడ్డు పునరుద్ధరణ పనులకు రూ. 45 లక్షలు మంజూరు చేయించారు. వీటితో పాటు ఆ గ్రామ ప్రజల అభ్యర్ధన మేరకు 4 గోకులాలు, గృహ నిర్మాణశాఖ సహకారంతో 19 ఇళ్లు, నీటితొట్టెలు నిర్మించారు. రైతుల కోసం 49 ఫీడర్ ఛానల్స్ ను జాతీయ ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి చేశారు. రెండు మైనర్ కాలువల పునరుద్ధరణ, మూడు కమ్యూనిటీ చెక్ డ్యామ్స్ మరమ్మత్తులు పూర్తి చేశారు. ఇచ్చిన హామీ మేరకు గ్రామస్తులు అడిగిన ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని పనులు చేపడుతున్నారు.

## నేతన్నకు వెంకన్న దీవెన... ఆప్కోతో టీటీడీ ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

తిరుమల తిరుపతి వెంకన్న దర్శనానికి రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. వారిలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సైతం ఉంటున్నారు. తిరుమలకు విచ్చేసే వీఐపీలకు వెంకన్న ప్రత్యేక దర్శనంతో వేద పండితులు వేదాశ్వీరచనం కూడా అందజేస్తుంటారు. వేదాశీర్వచనం చేసే సమయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు, స్వామి చిత్ర పటంతో పాటు కండువాలు, దుశ్శాలువాలు, కాటన్ బ్లౌజ్ లు అందజేయడం సంప్రదాయంగా వస్తోంది. దీనిలో భాగంగా కండువాలు, దుశ్శాలువాలు, కాటన్ బ్లౌజ్ లు సరఫరా చేయాలని ఆప్కోకు టీటీడీ మార్కెటింగ్ అధికారులు ఆర్డర్ ఇచ్చారు. మొదటి విడతగా మూడు వేల కండువాలు, అయిదు వేల దుశ్శాలువాలు, 90 వేల కాటన్ అప్పర్ లు, 75 వేల కాటన్ బ్లౌజ్ లు తిరుమల దేవస్థానానికి సరఫరా చేయాలోని ఆ ఆర్డర్ లో టీటీడీ అధికారులు పెర్కొన్నారు. టీటీడీకి అందజేసే కండువాలు, దుపట్టాలు, కాటన్ బ్లౌజ్ లపై ఓం నమో వేంకటేశాయ అని తెలుగులో, సంస్కృతంలో ముద్రించాలని టీటీడీ స్పష్టం చేసింది.

**ఆప్కో చరిత్రలో మొదటిసారి టీటీడీ ఆర్డర్ :** భక్తులకు అందజేసే కండువాలు, శాలువాలు, కాటన్ బ్లౌజ్ లు సరఫరా బాధ్యత గతంలో తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ కు ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత నేతన్నలకు ఏడాది పాటు ఉపాధి కల్పనే లక్ష్యంలో భాగంగా టీటీడీ నుంచి ఆప్కోకు ఆర్డర్ వచ్చేలా చేసిన కృషి ఫలించింది. ఈ అవార్డు రావడంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత, అధికారులు పాత్ర మరువలేనిది. ఆప్కో ఏర్పడి 51 ఏళ్లలో మొదటిసారి టీటీడీ నుంచి ఆర్డర్ రావడం విశేషం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత చేనేత రంగ అభివృద్ధికి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ముఖ్యంగా నేతన్నలకు నిత్యం ఉపాధి కల్పించే దిశగా కో ఆప్టెక్స్, టాటా, తనేరియా, బిర్లా ఆద్యం సంస్థలతో ఆప్కో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఆర్డర్ తో రాష్ట్రంలో చేనేతలకు మరింత ఉపాధి లభించనుందని చేనేత సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సీఎం చంద్రబాబునాయుడుకు, మంత్రి సవితకు, టీటీడీకి ధన్యవాదాలు తెలియజేశాయి.

**చేనేతకు వెంకన్న దీవెన : మంత్రి సవిత :** నేతన్నలకు 365 రోజుల పాటు ఉపాధి, ఆర్థిక భరోసా కూడిన జీవనం అందించాలన్న సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేతన్నలకు ప్రయోజనాలు కలిగేలా పథకాలు రూపొందిస్తున్నామని, పలు ఒప్పందాలు కూడా చేసుకుంటున్నామని వెల్లడించారు. ఆప్కో చరిత్రలో మొదటిసారి టీటీడీతో ఒప్పందం చేసుకోవడం ఆనందకర విషయమన్నారు. టీటీడీ ఆర్డర్ నేతన్నలకు వెంకన్న దీవెన వంటిదన్నవారు. టీటీడీ, ఆప్కో ఒప్పందం కుదురడంలో ముఖ్యభూమిక పోషించిన చేనేత, జౌళి శాఖాధికారులను మంత్రి సవిత అభినందించారు. ఏపీ నేతన్నలకు మేలు కలిగేలా నిర్ణయం తీసుకున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, పాలకమండలికి మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

# దేశానికి కీలకమైన లాజిస్టిక్స్ వ్యవస్థ డాక్ సేవక్‌లే

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో అత్యంత కీలకమైన లాజిస్టిక్స్ వ్యవస్థగా డాక్ సేవక్ లు సేవలందిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. టెక్నాలజీ పెరిగినా, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి సాంకేతికత అందుబాటులోకి వచ్చినా డాక్ సేవక్ ల స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని సీఎం స్పష్టం చేశారు. గుంటూరులో నిర్వహించిన గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళన్ కార్యక్రమంలో కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తపాలా శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోస్ట్ మాస్టర్ లను సన్మానించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... గ్రామీణ డాక్ సేవకుల సేవలు చిరస్మరణీయం. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పార్సిల్ వెళ్లాలంటే డాక్ సేవకుల వల్లే సాధ్యం. నేను చదువుకునే రోజుల్లో ఏ పని కావాలన్నా తపాలా వ్యవస్థపైనే ఆధార పడేవాళ్లం. గతంలో అతిపెద్ద కమ్యూనికేషన్ వ్యవస్థ పోస్టల్ సేవలే. పార్సిళ్లు, మనీ ఆర్డర్ల కోసం పోస్ట్ మ్యాన్ ఎప్పుడు వస్తారా అని ఎదురు చూసే పరిస్థితి. టెలీకమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు రావాలని బలంగా కోరుకున్నాం. నేడు 4 జీ సేవలు అందుబాటులోకి వచ్చినందుకు గర్వపడుతున్నాం. భారతీయ తపాలా శాఖకు ఉన్నంత నెట్వర్క్... మరే దేశంలోనూ ఏ పోస్టల్ సంస్థకు లేదు. మనకు స్వాతంత్ర్యం రాక ముందు నుంచే బలంగా ఉన్న వ్యవస్థల్లో భారతీయ తపాలా శాఖ ఒకటి. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పరోక్షంగా కీలక పాత్ర పోషించిన ఘనత పోస్టల్ శాఖకు ఉంది. దేశంలో 1.64 లక్షలకు పైగా పోస్టాఫీసులు ఉంటే, అందులో 90 శాతం గ్రామాల్లోనే ఉన్నాయి. ఇందులో దాదాపు 2.7 లక్షల గ్రామీణ డాక్ సేవకులు పనిచేస్తున్నారు.





మన రాష్ట్రంలో 9,100కు పైగా పోస్టాఫీసుల ద్వారా.. 17,000కు పైగా గ్రామీణ డాక్ సేవక్‌లున్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందంటే అందుకు డాక్ సేవకులే కారణం. 33 శాతం మేర డీబీటీ ద్వారా ఆర్థిక సాయం డాక్ సేవకుల ద్వారానే జరడం అభినందనీయం. బ్యాంకింగ్ సేవలు, బీమా సేవలు, డీబీటీ అనుసంధాన సేవలు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు డాక్ సేవకుల ద్వారానే అందుతున్నాయి. వికసిత్ భారత్, స్వరాంధ్ర సాధనకు డాక్ సేవకులు వెన్నెముక అని సీఎం చంద్రబాబు అన్నారు.

**డాక్ సేవకులకు ఎలక్ట్రికల్ సైకిళ్లు :** డాక్ సేవకుల గౌరవం పెంచేలా కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా పనిచేస్తున్నారు. జ్యోతిరాదిత్య తండ్రి మాధవరావ్ సింధియాతో నేను కలిసి పని చేశాను. విశాఖలోని గాజువాకలో ఒక ప్రాంతానికి సింధియా పేరుంది. త్వరలోనే ఆ ప్రాంతాన్ని జ్యోతిరాదిత్య సందర్శించాలని కోరుతున్నాను. టెక్నాలజీ ఎంత పెరిగినా మానవత్వంతో పని చేసిది డాక్ సేవకులే. వారి కోసం కేంద్ర మంత్రి డ్రెస్ కోడ్ ను డిజైన్ చేశారు. డాక్ సేవకులకు ఎలక్ట్రికల్ సైకిళ్లు కూడా ఇవ్వాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రిని కోరుతున్నాను. దీనివల్ల పొల్యూషన్ బెడద ఉండదు. డాక్ సేవక్ లు విధులు నిర్వహించటంలోనూ చక్కగా ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**డబుల్ ఇంజన్ సర్కార్ తో డబుల్ స్పీడ్ లో అభివృద్ధి :** నేను ఆనాడు టెక్నాలజీని ప్రమోట్ చేశాను. నేను రూపొందించిన విజన్ కారణంగా దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణ నుంచి వస్తోంది. 2047 నాటికి మన దేశం నెంబర్ వన్ గా ఉండాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ పనిచేస్తున్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారుతో డబుల్ స్పీడ్ లో అభివృద్ధి జరుగుతోంది. 20 నెలల్లో సంక్షేమం అందించాం. అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నాం. సుపరిపాలనకు నాంది పలికాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలను పౌరుల ఇంటి వద్దకే అందిస్తున్నాం. గత పాలకులు అమరావతిని స్మశానం, ఎడారి అన్నారు. దేవతల రాజధాని అమరావతి. ప్రపంచం మెచ్చేలా రాజధానిని నిర్మిస్తాం. గడిచిన ఐదేళ్లలో పోలవరాన్ని గోదావరిలో కలిపేశారు. 2027 గోదావరి పుష్కరాలకంటే ముందే గోదావరిని పూర్తి చేసి జాతికి అంకితమిస్తాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం కాకుండా లాభాలబాట పట్టించాం. జనవరిలో రూ. 54 కోట్ల లాభాలు ఆర్జించేందుకు ఎన్డీఏ పాలన సామర్థ్యమే కారణం. ఢిల్లీలో జరిగిన ఏఐ సదస్సుకు 80 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో మన దేశ నూతన ఆవిష్కరణలు చూసి వారంతా ఆశ్చర్యపోయారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో మంచి కార్యక్రమం నిర్వహిస్తే దేశ పరువు తీసే విధంగా కాంగ్రెస్ అర్ధనగ్న ప్రదర్శనలు చేసింది. వారికి ఏఐ తెలీదు. టెక్నాలజీపై అవగాహన లేదు. బ్రాండ్ దెబ్బతీసేలా వ్యవహరించడం మంచి పద్ధతి కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు హితవు పలికారు.

# ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్





(మొదటి పేజీ తరువాయి)

డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ఐ అండ్ ఐ శాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు ఎంఓసీపై సంతకాలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ ఇన్ఫ్రా బలోపేతం, గ్రామ పంచాయతీలకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని అందించేలా సహకార ఒప్పందం చేసుకున్నారు. త్వరిగతిన అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, క్షేత్ర స్థాయి సమన్వయానికి పూర్తి సహకారం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీల్లో ప్రాజెక్టు అమలు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. 1,692 ఫేజ్-I పంచాయతీల్లోని నెట్ వర్క్ అప్ గ్రేడ్ చేయడం, 11,254 ఫేజ్-IIలోని గ్రామాల డిజటల్ కనెక్టివిటీని పూర్తి చేయడం... ఇక కొత్తగా ఏర్పడిన 480 గ్రామ పంచాయతీలకు కనెక్టివిటీ ఇచ్చేలా చర్యలు తీసుకోవడం వంటి వాటిపై ఈ ఏబీఎన్‌పీ ప్రాజెక్టుతో పని చేయనుంది. 3,942 గ్రామాల్లో డిమాండ్ ఆధారంగా లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంచే అంశంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. డిజిటల్ కనెక్టివిటీ ద్వారా డిజిటల్ గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈ-గవర్నెన్స్ వంటి సేవలను మరింత బలోపేతం చేసేలా ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. ఈ సహకార ఒప్పందం కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు బాండ్ విడ్త్ పెంచమని బీఎస్ఎన్ఎల్‌ను అడిగాను. పెంచిన బ్యాండ్ విడ్త్‌తో టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్సులు పెట్టేవాడిని. టెలికాం రంగంలో సంస్కరణలు తీసుకురావాలని నాటి ప్రధాని వాజ్ పేయిని కోరాను. అప్పట్లో జాతీయ స్థాయిలో కమిటీ వేస్తే టెలికాం రంగంలో సంస్కరణలు చేపట్టాలని నివేదిక ఇచ్చాం. ఆ తర్వాత దేశవ్యాప్తంగా డి-రెగ్యులేషన్ అమల్లోకి వచ్చింది. భారతదేశంలో డిజిటల్ విప్లవానికి, డిజిటల్ కనెక్టివిటీ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చక్కగా పని చేస్తున్నారు" అని ముఖ్యమంత్రి అన్నారు.

**చక్కటి వ్యవస్థను నాశనం చేశారు... :** "2014-19 మధ్య కాలంలో ఫైబర్ నెట్ వ్యవస్థను ఏర్పాటు చేశాం... కరెంట్ పోల్స్‌పై ఫైబర్ కేబుల్స్ వేసి కనెక్టివిటీ కల్పించాం. 9.78 లక్షల ఇళ్లకు ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇచ్చాం. ఆ తర్వాత 2019లో వచ్చిన ప్రభుత్వం ఫైబర్ నెట్ వ్యవస్థను ఇబ్బందుల్లోకి నెట్టింది. గత ప్రభుత్వం దురుద్దేశ్యంతో చేసిన నిర్వాకం వల్ల కనెక్షన్ల సంఖ్య 3.80 లక్షలకు పడిపోయింది.. ఇప్పుడు మళ్లీ కేంద్ర సహకారంతో డిజిటల్ కనెక్టివిటీని పెంచుతాం. వికసిత్ భారత్ 2047 దిశగా అడుగులు వేయడానికి ఈ చర్యలు ఉపకరిస్తాయి. ఏఐ-క్వాంటం టెక్నాలజీలకు ప్రధాని చాలా ప్రాముఖ్యత ఇస్తున్నారు.. అందుకే ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సదస్సు నిర్వహించారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు వివిధ దేశాల నుంచి దిగ్గజ కంపెనీలకు చెందిన ప్రముఖులు వచ్చారు. గ్లోబల్ నాలెడ్జిని గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులోకి తీసుకురావాలంటే బ్యాండ్ విడ్త్ పెరగాలి...దానికి కేంద్రం సహకరిస్తోంది. డిజిటల్ కనెక్టివిటీ ఉంటే ప్రజలకు సేవలు కూడా చాలా సులువుగా అందుతాయి. వాట్సాప్ ద్వారా 900కు పైగా ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. టెక్నాలజీతో పట్టాదార్ పాస్ పుస్తకాలను ముద్రించి భద్రత కల్పిస్తున్నాం. భూ రికార్డులకు బ్లాక్ చైన్ టెక్నాలజీతో సెక్యూర్టీ కల్పిస్తున్నాం. టెక్నాలజీని అనుసంధానించి ప్రజారోగ్య రంగంలో సంజీవని ప్రాజెక్టు అమలు చేయబోతున్నాం. ఏఐ సహకారంతో విద్య, వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. వివిధ ఏఐ అప్లికేషన్లను అందుబాటులోకి తెస్తాం. ఏఐతో ఉద్యోగాలు పోవడం కాదు.. ఉద్యోగాలు క్రియేట్ అయ్యేలా యువతలో నైపుణ్యం పెంచుతున్నాం" అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**నెంబర్-1 స్థానం దక్కించుకునే సత్తా బీఎస్ఎన్ఎల్‌ది :** "టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ఇతర దేశాల కంటే భారతదేశం చాలా ముందుంది. భారతదేశంలో బ్రాండ్ న్యూ టెక్నాలజీ అందుబాటులో ఉంది. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా నేతృత్వంలో బీఎస్ఎన్ఎల్ నెంబర్-1 నెట్ వర్క్ అవుతుందనే నమ్మకం ఉంది. బీఎస్ఎన్ఎల్ సంస్థకు ఆ కెపాసిటీ ఉంది. గూగుల్ డేటా సెంటర్ ఏపీకి రాబోతోంది... విశాఖ నుంచి ఇతర దేశాలకు సబ్ సీ కేబుళ్ల ద్వారా డేటాను పంపే పరిస్థితి వస్తుంది. ఏపీలో 5 లక్షల మంది వర్క్ ఫ్రం హోం ద్వారా పని చేస్తున్నారు. పారిశ్రామిక విప్లవాన్ని భారత దేశం అందుకోలేకపోయింది.. సర్వీస్ రంగాన్ని అందుకున్నాం... అభివృద్ధి చెందుతున్నాం. ఏపీలో చాలా ప్రముఖ సంస్థలు, జీసీసీలు వస్తున్నాయి. వన్ ఫ్యామిలీ-వన్ ఏఐ ఎక్స్‌పర్ట్ అనే విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం. ఐబీఎం-టీసీఎస్-ఎల్ అండ్ టి కన్సార్షియంతో దేశంలో తొలిసారి క్వాంటం కంప్యూటర్ తెస్తున్నాం. వచ్చే రెండు మూడేళ్లల్లో క్వాంటం కంప్యూటర్లను అమరావతి నుంచి ఉత్పత్తి చేయాలని ఆలోచన చేస్తున్నాం. బ్యూరోక్రసీ కూడా ఏఐలో నైపుణ్యం పెంచుకోవాలి. టెలికాం, టెక్నాలజీ రంగంలో ఎలాంటి ప్రయోగాలు చేయాలన్నా... టెస్ట్ బెడ్‌గా ఉండేందుకు ఏపీ సిద్ధం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫైబర్ నెట్ ఎండీ గీతాంజలి శర్మ, బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నెయ్యి నాణ్యతను గుర్తించేందుకు ఫ్రాన్స్ నుంచి ఈ-టంగ్ అండ్ ఈ-నోస్ యంత్రాలు

**అక్టోబరు, 2024లో ఎఫ్ఎస్ఎస్ఐతో కుదిరిన ఒప్పందాన్ని అనుసరించి..! :** ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు అనుసరించి తిరుమలలో ల్యాబ్ ఏర్పాటుపై భాజపా జాతీయ నాయకుడు, రాష్ట్ర మంత్రి వైద్య, ఆరోగ్య శాఖ సత్యకుమార్ తనకున్న పరిచయాలతో కేంద్రంతో ఉన్నత స్థాయిలో సంప్రదింపులు జరిపారు. ఈ మేరకు ఫుడ్సేఫీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ. 23 కోట్లను మంజూరుచేసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ, ఎఫ్ఎస్ఎస్ఏఐ మధ్య ఒప్పందం అక్టోబరు 8, 2024న మంత్రి సత్యకుమార్ సమక్షంలో ఢిల్లీలో జరిగింది. అధికారులు తిరుమలలోని పిండిమిల్లు ఆవరణలో ఉన్న 12,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన పాత రెండు అంతస్తుల భవనాన్ని కేటాయించారు. దీనిని ఫుడ యబేటరీగా తీర్చిదిద్దే పనులు కిందటేడాది జులైలో ప్రారంభమయ్యాయి.

**50 పరికరాలు/యంత్రాలతో విరివిగా నాణ్యత పరీక్షలు :** ఈ ల్యాబ్లో మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ, సెన్సరీ విభాగాల్లో నమూనాల పరీక్షలు జరగనున్నాయి ప్రసాదాలు, ఆహార పదారాలు, నీరు, ముడిసరకుల నాణ్యతను పరీక్షిస్తారు. ప్రసాదాలు, వాటికి వినియోగించే ముడిసరకుల్లో



పురుగు మందుల అవశేషాలు, భారలోహాలు, క్రిమీకీటకాలు, యాంటీబయాటిక్స్ వంటి వాటి నమూనాలను ఈ ల్యాబ్లో పరీక్షిస్తారు. ఆహార పదార్థాలు, ప్రసాదాల్లో 200 రకాల పురుగు మందుల అవశేషాలు గుర్తించే సామర్థ్యం కలిగిన యంత్రాలు ఈ ల్యాబ్ ద్వారా అందుబాటులోనికి వస్తున్నాయి. ఈ ల్యాబ్లో తితిదే జలప్రసాదాల నమూనాలను కూడా పరీక్షిస్తారు. వీటి అన్నింటి కోసం మొత్తం 50 రకాల పరికరాలు/ యంత్రాలు ఈ ఫుడ్ ల్యాబ్రేటరీలో ఉంటాయి. ఈ ల్యాబ్ నిర్వహణ కోసం వివిధ హోదాల్లో కలిపి 40 మంది ఉద్యోగులను వైద్య ఆరోగ్య శాఖ, తితిదే సంయుక్తంగా అందుబాటులోనికి తెస్తున్నాయి. ఈ ల్యాబ్ కార్యకలాపాలపై మరో ఒప్పందం వైద్య ఆరోగ్య శాఖ, తితిదే మధ్య త్వరలో జరగనుంది. తిరుమల వంటి పుణ్యక్షేత్రాల్లో ల్యాబ్ల ఏర్పాటుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ వివిధ రాష్ట్రాలతో ఒప్పందాలు చేసుకుంది. అయితే ఏపీలో మాత్రమే తొలిసారిగా ఓ పుణ్యక్షేత్రంలో ల్యాబ్ అత్యాధునిక వసతులతో రాబోతుంది.

**ఫ్రాన్స్ నుంచి ఈ-టంగ్ అండ్ ఈ-నోస్ యంత్రాలు! :** ఫ్రాన్స్లో తయారయ్యే ఈ యంత్రాన్ని తిరుమలలోని ఫుడ్ ల్యాబ్బరీలోనూ సమకూరుస్తున్నారు. ప్రస్తుతం ఇవి అందుబాటులో ఉన్న ల్యాబరేటరీలు దేశ వ్యాప్తంగా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. మనిషి ముక్కు ద్వారా వాసన, నోటి ద్వారా రుచి ఎలా చూస్తారో ఈ యంత్రాల ద్వారా ప్రసాదాలు, ఆహార పదార్థాలు, వాటి తయారీకి వినియోగించే ముడిసరకులను పరీక్షించేందుకు వీలుంది. తిరుమలలో కల్తీ నెయ్యి ఘటనను దృష్టిలో ఉంచుకుని మంత్రి శ్రీ సత్యకుమార్ చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్రం ఈ మిషన్ కొనుగోలుకు అవసరమైన రూ. 3.5 కోట్లను అదనంగా ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ-టంగ్, ఈ-నోస్ యంత్రాల వినియోగానికి ఉపయోగించే గ్యాస్ సిలిండర్లు కూడా ఫ్రాన్స్ నుంచి వస్తాయి.

## ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ సస్పెన్షన్ పొడిగింపు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ సస్పెన్షన్‌ను పొడిగిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్, 1969లోని రూల్ 3 (3) ప్రకారం ఈ నిర్ణయం తీసుకుంది. క్రిమినల్ కేసు పూర్తి లేదా పదవీ విరమణలో ఏది ముందైతే అప్పటి వరకు సస్పెన్షన్ కొనసాగనుంది. సునీల్‌కుమార్‌పై ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ పర్యటనలకు వెళ్లడం, వైకాపా హయాంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును వేధించిన కేసుతో పాటు అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగం వ్యవహారంలో సునీల్‌కుమార్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గతంలో ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

## కాంగ్రెస్ మురికి రాజకీయాలతో దేశానికి అప్రతిష్ఠ





(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తిగత శత్రుత్వంపైనే దృష్టి పెడుతున్నారన్నారు. గతంలో తనను, తన తల్లిని అవమానించారని.. ఇప్పుడు ప్రపంచ నేతల ఎదుట దేశాన్ని అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంటే.. కాంగ్రెస్ నేతలు మాత్రం దేశపరువు తీయడానికి చూస్తున్నారని దుయ్యబట్టారు.

**అసలేం జరిగింది..? :** ఏఐ ఇంపాక్ట్ సమిట్‌ను లక్ష్యంగా చేసుకొని కాంగ్రెస్ యువజన విభాగమైన 'భారత యువజన కాంగ్రెస్ (ఐవైసీ)' కార్యకర్తలు నాటకీయ రీతిలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఎగ్జిబిషన్ హాలు నంబరు-5లోకి ప్రవేశించిన దాదాపు 15 మంది కార్యకర్తలు.. చొక్కాలు విప్పి ఆందోళన చేపట్టారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రానికి, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా నినాదాలు రాసి ఉన్న టీ-షర్ట్‌లు వారి చేతుల్లో కనిపించాయి. వారి చర్యల వల్ల కొంత సమయం పాటు సమావేశానికి అంతరాయం కలిగింది. అనంతరం భద్రతా సిబ్బంది వారిని కస్టడీలోకి తీసుకున్నారు.

## 26న పట్టాభిషేక మహోత్సవం



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** ఈనెల (ఫిబ్రవరి) 26న జరగబోయే మఠాధిపతి శ్రీ శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి పట్టాభిషేక మహోత్సవంలో సంప్రదాయ వ్యవహారాలకు భంగం కలగకుండా ౘ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ శాఖ చేయవలసిన ఏర్పాట్లు కోసం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం కి మైదుకూరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ మరియు మఠం సబ్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్ లు విచ్చేసి మేనేజర్ ఈశ్వరాచారి తో పిపిఎన్ ప్రసాద్ మఠాధిపతి సోదరుడు దత్తాత్రేయ లతో సంప్రదించి కార్యక్రమ వివరాలు అడిగి తెలుసుకొని ఆలయ పరిసరాలను పరిశీలించి వారికీ తగు సూచనలు ఇవ్వడం జరిగింది. సిఐ శివశంకర్ ఎస్ఐ శివప్రసాద్ మాట్లాడుతూ పట్టాభిషేకం మహోత్సవానికి ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామని తెలిపారు.

# మోడల్ స్కూల్స్‌లో జూనియర్ లెక్చరర్ పదోన్నతులు కల్పించాలి




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని 164 ఏపీ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న రెగ్యులర్ టీచర్ల సమస్యలను పరిష్కరించేందుకు జూనియర్ లెక్చరర్ స్థాయి కేడర్ పదోన్నతులు ఇవ్వాలని మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఈ సమస్యలను శాసనమండలిలో భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఇంటర్మీడియట్ విద్య బలోపేతం కోసం వెంటనే చర్యలు అవసరమని తెలిపారు.
అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.డి. షఫీ ప్రకటనలో, జూనియర్ లెక్చరర్ ప్రమోషన్ల ద్వారా దాదాపు 2,000 టీజిటి, పిజిటి, జేఎల్ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా నిర్వహించవచ్చని, 2,500 మంది టీజీటీ, పీజీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించవచ్చని తెలిపారు.
మోడల్ స్కూల్స్ విద్యా శాఖలో విలీన కారణంగా మోడల్ స్కూల్స్ సొసైటీని రద్దు చేసి మిగతా ప్రభుత్వ టీచర్ల విధానాలలా సర్వీస్ రూల్స్ రూపొందించాలని సూచించారు. విధి నిర్వహణలో చనిపోయిన 26 మంది రెగ్యులర్ టీచర్ల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు, హిందీ టీజీటీ పోస్టును పీజీటీగా ఉన్నతీకరించాల్సిన అవసరాన్ని కూడా గుర్తించారు.
మోడల్ స్కూల్స్ సమస్యలపై శాసనమండలిలో చర్చించిన భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి చర్యలకు అవకాశం కల్పించినందుకు అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది.

# 25న మూడు చక్రాల స్కూటర్ల మంజూరుకు ఇంటర్వ్యూలు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** మూడు చక్రాల స్కూటర్ల మంజూరుకు ఈ నెల 25న ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల , వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎన్.వెంకటరవణప్ప తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు , వయో వృద్ధుల సహాయ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ , జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు, గుంటూరు జిల్లా శారీరక విభిన్న ప్రతిభావంతులు (ఓహెచ్)మూడు చక్రాల స్కూటర్లు మంజూరుకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని, వారు మాత్రమే ఇంటర్వ్యూలకు అర్హులని తెలిపారు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరు పట్టణం బృందావన్ గార్డెన్స్ ఒకటవ లైన్ లో ఉన్న ఎన్. టి. ఆర్ స్టేడియం జిల్లా ఎంపిక కమిటి నిర్వహించే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో హాజరు కావాలని కోరారు.

# అవిముక్తేశ్వరానంద సరస్వతిపై ఫోక్సో కేసు



**ప్రయాగ్‌రాజ్(జర్నలిస్ట్ ఫైల్) :** ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రముఖ స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతిపై పోక్సో కేసు నమోదు చేయాలని ప్రయాగ్‌రాజ్ ప్రత్యేక కోర్టు యుపి పోలీసులను ఆదేశించింది. గత నెలలో ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మాఘ మేళా సందర్భంగా నిందితుడు తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఇద్దరు బాలికలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మతపరమైన సేవ, ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు నటిస్తూ సరస్వతి ఈ చర్యలకు పాల్పడ్డారని వారు పోలీసులకు తెలిపారు. అయితే పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై పోక్సో కోర్టు అదనపు సెషన్స్ జడ్జి వినోద్ కుమార్ చౌరాసియా విచారించారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా దర్యాప్తు జరపాలని, బాధితుల గౌరవాన్ని కాపాడాలని పోలీసులను ఆదేశించారు. మాఘ మేళా అనేది ఏటా జరిగే జాతర. ఇందులో గంగా, యమునా, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం చేయడానికి యాత్రికులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఆ సమయంలో వందలాది మంది సాధువులు, మత పెద్దలు సంగం వద్ద తమ శిబిరాలను ఏర్పాటు చేసుకుంటారు. ఈ సందర్భంగా ఆయన ఆశ్రమంలో 14, 17 ఏళ్ల వయసు గల ఇద్దరు మైనర్లపై అత్యాచారయత్నం జరిగిందనే విషయం వెలుగులోకి వచ్చింది. అయితే 'గురు సేవ' పేరుతో మైనర్లపై అత్యాచారానికి పాల్పడిన స్వామిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని శాకుంభరీ పీఠాధీశ్వర్ అశుతోష్ బ్రహ్మచారి మహరాజ్ పిటిషన్ దాఖలు చేశారు.

# రాజమహేంద్రవరంలో అనూరియా



**రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్) :** తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో అనూరియా (మూత్రం ఆగిపోవడం) కేసులు నమోదు కావడంతో ఆదివారం కలకలం రేగింది. నగర శివారు లాలాచెరువు, చౌడేశ్వర నగర్‌లో మొత్తం 8 కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం వీరంతా ఒకేసారి అనారోగ్యం బారిన పడ్డారు. బాధితులంతా 60 ఏళ్లు పైబడిన వారే. ఆ ప్రాంతంలో రోజూ ఒక వ్యక్తి వచ్చి పాలు పోసేవాడని, ఆ పాలు తాగిన వారికి ఇలా జరిగిందని స్థానిక ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తన బృందంతో కిమ్స్ ఆస్పత్రిని సందర్శించి బాధితులను పరిశీలించారు. వైద్యుల ప్రాథమిక నివేదికలు, కుటుంబ సభ్యుల వివరాలు, కేసు చరిత్ర ఆధారంగా ఆకస్మిక మూత్రపిండ వైఫల్యంపై అనుమానం వ్యక్తం చేశారు. బాధితులందరూ ఒకే విక్రేత వద్ద నుంచి పాలు కొనుగోలు చేసినట్టు గుర్తించామన్నారు. నమూనాలు సేకరించి ఫోరెన్సిక్ పరిశీలనకు పంపించారు. నివేదికలు, ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

# ట్రాఫిక్ కష్టాలకు చెక్ - విజయవాడలో 14 కిమీ ఎలివేటెడ్ ఫ్లై ఓవర్



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :**
హైదరాబాద్ - మచిలీపట్నం జాతీయ రహదారి, విజయవాడ నగర పరిధిలో ఉన్న మేరకు ఆ మార్గంలో ఎలివేటెడ్ ఫ్లై ఓవర్‌ను నిర్మించే ప్రతిపాదనను అధికారులు ప్రస్తుతం పరిశీలిస్తున్నారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ సమీపంలోని రాజీవ్ పార్క్ వద్దనున్న కనకదుర్గ ఫ్లై ఓవర్ నుంచి మచిలీపట్నం వైపు వెళ్లే మార్గంలో గంగూరు కూడలి వరకు మొత్తం 14 కిలోమీటరల వరకు దాదాపు 6 వరుసలతో పై వంతెనను నిర్మించాలని ఆలోచిస్తున్నారు.
ముఖ్యంగా దీని వలన జాతీయ రహదారిలో ప్రయాణించే వారికి ఏ ఆటంకాలు ఉండవని, అంతేకాకుండా విజయవాడ నగర ట్రాఫిక్ కష్టాలు కూడా తీరతాయని సంబంధిత శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ ప్రాజెక్టును ఏ విధంగా చేపట్టవచ్చొన్న భిన్నమైన ప్రణాళికలపై దీల్లీ స్థాయిలో ఉన్నటువంటి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు చర్చలు జరుపుతున్నారు.
ట్రాఫిక్ కష్టాలకు చెక్: హైదరాబాద్ - విజయవాడ - మచిలీపట్నం రహదారి-65 విజయవాడ పరిధిలో ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, భవానీ పురం, కనకదుర్గ ఫ్లైఓవర్, కృష్ణలంక, వారధి జంక్షన్, బెంజ్ సర్కిల్, ఆటోనగర్ గేట్, కానూరు, పోరంకి, పెనమలూరు వైపు వెళ్తుంది. అయితే ప్రస్తుతం హైదరాబాద్ - విజయవాడ మధ్య హైవేను ప్రధానంగా 6 వరుసలుగా విస్తరించే ప్రాజెక్టును చేపట్టడం గమనార్హం. దీనిని ముఖ్యంగా గొల్లపూడి వద్ద విజయవాడ బైపాస్?కు క్రాస్ అయ్యే పాయింట్? వరకే విస్తరించాల్సిందిగా మొదట భావించారు.
కానీ ఏపీ ప్రభుత్వం ఒత్తిడితో భవానీపురం వద్ద కనకదుర్గ ఫ్లైఓవర్ వరకు విస్తరించేందుకు గాను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ సన్నాహాలను చేసేందుకు సిద్ధపడుతుంది. మరొకవైపు ఉన్న విజయవాడ-మచిలీపట్నం రహదారిని 6 వరుసలుగా విస్తరించేటటుంటి ప్రాజెక్టును సైతం చేపడుతుండటం గమనార్హం. అదే విధంగా దావులూరు టోల్‌ప్లాజా సమీపంలో ఔటర్ రింగ్‌రోడ్ క్రాస్ అయ్యే ప్రదేశం నుంచి మచిలీపట్నం వరకు 6 వరుసలుగా విస్తరించనున్నారు.
6 వరుసలుగా విస్తరణ: అంతేకాకుండా విజయవాడ నగర పరిధిలోని కనకదుర్గ ఫ్లైఓవర్ తర్వాత నుంచి వరుసగా కృష్ణలంక, వారధి జంక్షన్, స్కూల్ బ్రిడ్జి, బెంజ్ సర్కిల్ వరకు, అక్కడ నుంచి మచిలీపట్నం వైపు కానూరు, పోరంకి, పెనమలూరు, గంగూరు, కంకిపాడు వైపుగా దావులూరు టోల్?ప్లాజా వరకు 4 వరుసలుగానే ఈ రహదారి మిగిలిపోనుంది. తాజాగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఉన్నతాధికారుల సమావేశంలో ఈ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. అంతేకాకుండా విజయవాడకు ఇపువైపులా 6 వరుసలుగా విస్తరించి వాహన రద్దీ ఎక్కువగా ఉండే నగరం మధ్యలో మాత్రం 4 వరుసలుగా మిగిలిపోతే ఎలాగైనా ప్రశ్న తలెత్తింది. దీనికి నగరంలో 6 వరుసలతో ఎలివేటెడ్ నిర్మించడమే పరిష్కారమనే ఓ అంచనాకు వచ్చారు. దీని ద్వారా కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి గంగూరు కూడలి వరకు 6 వరుసలతో ఎలివేటెడ్ వంతెన ప్రతిపాదనలను సిద్ధం చేయాల్సిందిగా ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశించారు.
కనకదుర్గ వారధి నుంచి గంగూరు క్రాస్ వరకు: అయితే ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి గాను బెజవాడ నగర పరిధిలో భూసేకరణ అవసరం ఎక్కువగా ఉండదు. వివిధ జంక్షన్ల వద్ద వంతెనపైకి వెళ్లేందుకు, అదే విధంగా బయటకు వెళ్లేందుకు నిర్మించేటటువంటి అప్రోచ్?లకు మాత్రం భూమిని సేకరించాల్సిన అవసరం ఉంటుంది. కానీ మొత్తంగా 14 కిలోమీటర్ల పొడవునా ఒకే వంతెనను నిర్మించాలా? లేక 2 భాగాలుగా విభజించాలా అనే చర్చ మాత్రం ఎక్కువగా నడుస్తుంది. దాదాపు ఒకే వంతెనను నిర్మించాలంటే మధ్యలో బెంజ్ సర్కిల్ వద్దన ఇప్పటికే 2 వంతెనలు ఉన్నాయి.
దాంతో వాటిపై నుంచి బందరు వైపు మలుపు తిరిగే విధంగా ఎలివేటెడ్ ఫ్లైఓవర్ డిజైన్‌ను చేయాల్సి ఉంటుంది. వీటికి బదులుగా కనకదుర్గ వారధి నుంచి కృష్ణలంక, వారధి కూడలి మీదుగా జెంజ్ సర్కిల్ సమీపం వరకు మొత్తం 5 కిలోమీటర్ల ఒక ఎలివేటెడ్ ఫ్లై ఓవర్, అదే విధంగా బెంజ్ సర్కిల్ నుంచి గంగూరు కూడలి వరకు 9 కిలోమీటర్ల మరో ఫ్లై ఓవర్‌ను నిర్మిస్తే ఎలా ఉంటుదనే విషయాన్ని ప్రస్తుతం పరిశీలించనున్నారు. దాంతో మొత్తంగా హైదరాబాద్ - విజయవాడ మధ్య, విజయవాడ - మచిలీపట్నం మధ్య హైవే విస్తరణ పేరుపై ఒకే హైవేపై మొత్తం 2 ప్రాజెక్టులకు డీపీఆర్‌ను రూపొందిస్తున్నారు. అందులోనే ఈ ఎలివేటెడ్ ఫ్లై ఓవర్‌ను సైతం చేర్చే అంశాన్ని ప్రస్తుతం పరిశీలిస్తున్నారు.

# బీజేపీ జిల్లా ప్రశిక్షణ మహా అభియాన్ వర్క్‌షాప్ విజయవంతం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** బీజేపీ గుంటూరు జిల్లా కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ మహా అభియాన్ వర్క్‌షాప్ ఘనవంతంగా ముగిసింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై, కార్యకర్తలకు పార్టీ సిద్ధాంతాలు, సామాజిక బాధ్యతలు, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ భావజాలం వంటి కీలక అంశాలపై లోతైన అవగాహన ఇచ్చారు.
జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, భరతమాత, శ్యాంప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటాలకు పూలమాలలు వేసి గౌరవం ప్రకటించడం కార్యక్రమానికి ప్రత్యేక శోభనాన్ని చేకూర్చింది. సభలో పాల్గొన్న కార్యకర్తలలో ఉత్సాహానికి అడ్డంకి లేకుండా, భవిష్యత్తులో పార్టీ సాధించవలసిన లక్ష్యాలపై ప్రత్యేక చర్చలు జరిగాయి.
జిల్లా శిక్షణ కన్వీనర్ భీమినేని చంద్రశేఖర్ పవర్ ప్రెజెంటేషన్ ద్వారా మండలాల్లో శిక్షణ కార్యక్రమాలు ఎలాంటి విధంగా, సమర్థవంతంగా నిర్వహించాలో వివరించారు. ప్రతి మండలంలో మార్చి 7 నుండి ఏప్రిల్ 14 వరకు వర్క్‌షాప్‌లను పూర్తిచేయాలని కార్యకర్తలకు సూచనలిచ్చారు.
రాష్ట్రప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ మాట్లాడుతూ, "ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి ముందుకు తీసుకెళ్ళాలి. పాత మరియు కొత్త కలయికల ద్వారా పార్టీ శక్తిని మరింత పెంచాలి. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సమరసత, స్వదేశీ భావజాలం, కుటుంబ బాధ్యతలు, పౌర విధులు – ఈ ఐదు సూత్రాలు ప్రతి ఒక్క కార్యకర్త జీవితంలో పాటించాల్సిన మూల సూత్రాలు. ప్రతి ఒక్కరు స్వదేశీ వస్తువులను వాడి, దేశ అభివృద్ధికి స్ఫూర్తిదాయకంగా సహకరించాలి" అని ఉత్సాహంగా చెప్పారు. కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలను తెలుసుకొని ప్రజలకు చేరువ అవ్వడం, సమాజంలో హక్కులేకాక బాధ్యతలను నిర్వర్తించడం, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలను స్ఫూర్తిదాయకంగా ముందుకు తీసుకెళ్లాలి అని పేర్కొన్నారు.
సమావేశంలో రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ , రాష్ట్ర ఉపాధ్యక్షులు బిట్ర శివన్నారాయణ, సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, టుబోకో బోర్డు చైర్మన్ చి. యశ్వంత్, జిల్లా శిక్షణ కో-కన్వీనర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, మండల అధ్యక్షులు మరియు ఇతర సీనియర్ నాయకులు హాజరయ్యారు.




# బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా ప్రధాని 'మన్ కీ బాత్'




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** "భారత దేశ అభివృద్ధి భావి తరంగం విద్యార్థుల చేతుల్లోనే ఉంది. ప్రధాని ప్రసంగాలను శ్రద్ధగా వినడం ద్వారా వారు స్ఫూర్తి పొందుతున్నారు" అని రాష్ట్ర బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పనతల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగాన్ని ప్రసారంగా అందించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షులు లాల్ సింగ్ ఆర్య, జాతీయ సోషల్ మీడియా కన్వీనర్ అనిమా సుంకర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎల్ఇడి స్క్రీన్ ముందు కూర్చొని ప్రధాని ప్రసంగాన్ని ఆసక్తిగా వీక్షించారు.
ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ మాట్లాడుతూ, దళిత వర్గాల అభివృద్ధికి ప్రధాన మంత్రి మోడీ అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. "భారత దేశ అభివృద్ధి భావి తరంగం విద్యార్థుల చేతుల్లోనే ఉంది. ప్రధాని ప్రసంగాలను శ్రద్ధగా వినడం ద్వారా వారు స్ఫూర్తి పొందుతున్నారు" అని పేర్కొన్నారు.
బిజెపి ఎస్సీ మోర్చా నిర్వహించిన 'మన్ కీ బాత్' క్విజ్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయగా, విజేతలను దేశంలోని ప్రముఖ విద్యాసంస్థలు, చారిత్రక ప్రదేశాలకు పర్యటనకు పంపి ప్రోత్సహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పర్యటనలో జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, ఐఐటీ ఢిల్లీ, ఎన్ఐటీ ఢిల్లీ సందర్శన, భారత పార్లమెంట్, దీక్షాభూమి, సంత్ గురు రవిదాస్ జన్మస్థలం పర్యటనలు ఉంటాయని చెప్పారు.
బిజెపి నేతలు తెలిపారు, విద్యార్థులకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు, దళిత వర్గాల అభివృద్ధి, విద్య, అభ్యుదయంపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమాల ముఖ్య లక్ష్యం. కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

# మఠాధిపతులు శ్రీశ్రీవీరధర్మజ వేంకటాద్రి స్వాముల వారి పట్టాభిషేక మహోత్సవం



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** కాలజ్ఞాన ప్రబోధ కర్త మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠంలో ఈనెల 24,25, 26 తేదీలలో మఠం ప్రాంగణంలో జరగనున్న నూతన మఠాధిపతి పట్టాభిషేకానికి అందరూ ఆహ్వానితులేనని మఠాధిపతి తమ్ముడు శ్రీ దత్తాత్రేయ స్వామి భక్తులకు పిలుపునిచ్చారు. 26వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 1.30 గం.మధ్యలో స్వర్ణ కిరీట ధారణతో మఠాధిపతి సింహాసనం అధిష్టించే ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్ణయించిన ముగ్గురు ఆధ్యాత్మికవేత్తలతో కిరీట ధారణ ఉంటుందని ఆయన తెలియజేశారు. గణపతి మండపం ముందు ఏర్పాటు చేయనున్న వేదికపై సింహాసన సమయంలో తదుపరి పల్లకిలో మహాద్వారం దగ్గరకు విచ్చేసి భక్తులకు శిష్యులకు జనులకు మఠాధిపతి దర్శనం ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ సమయంలో మఠాధిపతితో కరచాలనం కానీ ఫోటోలు కానీ మఠాధిపతి ప్రతి నమస్కారం కానీ ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమం పూర్తి ఆధ్యాత్మిక పద్ధతిలో అనగా వైదిక ఆగమ శాస్త్ర పద్ధతిలో జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 3 గం తర్వాత ఆధ్యాత్మికవేత్తలు, వివిధ రంగాల్లో ప్రముఖులు, మఠాధిపతి కుటుంబ సభ్యులు, మీడియా ప్రతినిధులు మరియు ఆత్మీయులతో కళ్యాణ మండపంలో ఆధ్యాత్మిక సమావేశం ఉంటుందని తెలిపారు. మఠం ఆధ్వర్యంలో భక్తులకు 5 చోట్ల అన్నదాన ప్రసాద కార్యక్రమ ఏర్పాట్లు సహా వివిధ అన్నదాన సత్రములలో భోజన ఏర్పాట్లు జరుగుతాయన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు శిష్యులకు ప్రముఖులకు వసతి సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. సావిత్రమ్మ ఆశ్రమం వెనుక మరియు అయ్యప్ప నగర్ లో వాహన పార్కింగ్ సౌకర్యం ఉంటుందని దీనిని భక్తులు గమనించాలని ఆయన తెలియజేశారు. ఎండ వేడిమికి ఇబ్బందులు లేకుండా చలువ పందిళ్లు,నీరు,మజ్జిగ వంటివి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. గతంలో ఒకటి రెండు తరాలు చూడని అరుదైన ఈ పట్టాభిషేకశీ పూర్తి ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు, శిష్యులు జనులు పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని ఆయన విన్నవించారు.

# 70వ ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డ్స్



**కొచ్చి(జర్నలిస్ట్ ఫైల్) :** 70వ ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డుల ప్రదానోత్సవం శనివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. కొచ్చిలోని అడ్లక్స్ సెంటర్‌లో కేరళ టూరిజం శాఖ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో దక్షిణాది చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు సందడి చేశారు. సౌత్ అవార్డ్స్ తెలుగులో పుష్ప-2కు అత్యధికంగా ఐదు అవార్డులు లభించాయి. ఉత్తమచిత్రంతో పాటు, ఉత్తమ దర్శకుడు (సుకుమార్), ఉత్తమ నటుడు (అల్లు అర్జున్), ఉత్తమ సంగీత దర్శకుడు (దేవీశ్రీప్రసాద్) అవార్డులు కూడా పుష్ప ఖాతాలోకి వెళ్లాయి. బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్‌ను కూడా కల్కి 2898 ఎడితో కలిసి పుష్ప-2 సంయుక్తంగా సొంతం చేసుకుంది. '35: చిన్నకథ కాదు' చిత్రానికిగానూ నివేదా థామస్ ఉత్తమ నటి అందుకున్నారు. 2024లో విడుదలైన సినిమాలకుగాను ఈ అవార్డులు ప్రకటించారు. శనివారం తెలుగుతోపాటు, తమిళం, కన్నడ, మలయాళం సినిమాలకు కూడా అవార్డులను అందజేశారు. టాలీవుడ్‌కు దక్కిన అవార్డుల జాబితా ఈ విధంగా ఉంది.

ఉత్తమ చిత్రం : పుష్పా2
ఉత్తమ దర్శకుడు : సుకుమార్ (పుష్పా2)
బెస్ట్ మ్యూజిక్ ఆల్బమ్ : దేవీశ్రీ ప్రసాద్ (పుష్పా2)
ఉత్తమ సహాయ నటుడు : అమితాబ్ బచ్చన్ (కల్కి 2898 ఎడి)
ఉత్తమ సహాయ నటి : అంజలి (గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి)
ఉత్తమ పరిచయ దర్శకుడు : యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు)
ఉత్తమ పరిచయ నటుడు : సందీప్ సరోజ్ (కమిటీ కుర్రోళ్లు)
ఉత్తమ పరిచయ నటి : నయన్ సారిక (గం గం గణేశా)
ఉత్తమ సాహిత్యం : చుట్టమల్లె చుట్టేస్తోంది (దేవర), రచయిత: రామజోగయ్యశాస్త్రి
ఉత్తమ గాయకుడు : శ్రీకృష్ణ (కుర్చీ మడతపెట్టి: గుంటూరు కారం)
ఉత్తమ గాయని : శిల్పారావు (చుట్టమల్లె)
బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్ : నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2898 ఎడి), రామకృష్ణ- మోనిక (పుష్ప 2)
బెస్ట్ కొరియోగ్రఫీ : శేఖర్ మాస్టర్ (కుర్చీ మడతపెట్టి)
ఉత్తమ చిత్రం (క్రిటిక్స్) : లక్కీ భాస్కర్
ఉత్తమ నటుడు (క్రిటిక్స్) : తేజ సజ్జా
ఉత్తమ నటి (క్రిటిక్స్) : కాజల్ అగర్వాల్ (సత్యభామ)

**థాంక్యూ ఫిల్మ్‌ఫేర్... బెస్ట్ యాక్టర్ అవార్డుపై అల్లు అర్జున్ స్పందన :** ఈ పురస్కారం అందుకోవడంపై అల్లు అర్జున్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. "ఈ అద్భుతమైన గౌరవాన్ని అందించిన ఫిల్మ్‌ఫేర్‌కు ధన్యవాదాలు. నన్ను ప్రత్యేకంగా అభిమానించే ఈ గడ్డపై అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. అందరి ఆశీర్వాదాలకు నేను వినమ్రతతో ఉన్నాను. నాపై అనంతమైన ప్రేమను కురిపిస్తున్న నా అభిమానులందరికీ ఈ అవార్డును అంకితం చేస్తున్నాను" అని పేర్కొన్నారు.
అల్లు అర్జున్‌కు ఇది ఏడో ఫిల్మ్‌ఫేర్ అవార్డు కావడం విశేషం. దీంతో అత్యధిక ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్న నటుడిగా మెగాస్టార్ చిరంజీవి నెలకొల్పిన రికార్డును అల్లు అర్జున్ సమం చేశారు.

# పోలీసులకు లొంగిన దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో సిపిఐ (మావోయిస్టు) జాతీయ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీతో పాటు మరో కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డిలు ఎట్టకేలకు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయారు. వారితో పాటు మరో 20 మంది మావోయిస్టులు కూడా లొంగిపోయారు. రాష్ట్రానికి చెందిన దాదాపు 17 మంది మావోయిస్టులు మాత్రమే అజ్ఞాతంలో ఉన్నారని, వారు కూడా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలవాలని డిజిపి ఇటీవల ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఎస్ఐబికి చెందిన స్పెషల్ ఆపరేషన్ టీం రాష్ట్ర సరిహద్దుల్లో విశ్వసనీయమైన సమాచారంతో జరిపిన ప్రత్యేక ఆపరేషన్ దేవ్‌జీ, రాజిరెడ్డి బృందం లొంగుబాటుకు కారణంగా తెలుస్తోంది. దేవ్‌జీ, మల్లారాజిరెడ్డి బృందం లొంగుబాటుపై ఒకట్రెండ్రోజుల్లో రాష్ట్ర డిజిపి నుంచి అధికారిక ప్రకటన లేదా మీడియా సమావేశం ద్వారా వెల్లడి కావచ్చని తెలుస్తోంది. కాగా మావోయిస్టు అగ్రనేత ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దేవ్‌జీ లొంగుబాటు వ్యవహారాన్ని కేంద్ర హోం శాఖ సైతం సునిశితంగా పరిశీలిస్తున్నట్టు సమాచారం.



## ఎమ్మెల్యేను కలసిన బైరెడ్డిపల్లి ఎంపీడివో ఉపేంద్ర

**బైరెడ్డిపల్లి, ఫిబ్రవరి 22 (జర్నలిస్ట్ ఫైల్)**

పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని బైరెడ్డిపల్లి ఎంపీడివో ఉపేంద్ర శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాపరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అకౌంట్స్ సెక్షన్ ఆఫీసర్ గా పని చేస్తూ ప్రమోషన్ పై బైరెడ్డిపల్లి ఎంపీడివో గా ఇక్కడికి వచ్చారు. విధుల్లో చేరిన అనంతరం అసెంబ్లీ సమావేశాల నుంచి విచ్చేసిన ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలసి సన్మానించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు.

## కార్యకర్త కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఆర్థిక సహాయం



**ఆగిరిపల్లి, ఫిబ్రవరి 22 (జర్నలిస్ట్ ఫైల్)**

ఆగిరిపల్లి మండలం అమ్మవారి గూడెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త గజ్జెల రాంబాబు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.15,000 నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రాంబాబు కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తల కష్టసుఖాల్లో పార్టీ తోడుగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నెరుసు సతీష్, మండల పార్టీ అధ్యక్షులు నక్కనబోయిన వేణు, ప్రధాన కార్యదర్శి కొల్లిపర సాంబశివరావు, ఆగిరిపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు పామర్తి నరసింహారావు, నరసింగపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు పొన్నం రవికిరణ్, ఎస్.ఎస్. బాబు, అమ్మవారి గూడెం గ్రామ పార్టీ అధ్యక్షులు జనసూత్రం దుర్గారావు, సర్పంచి జలసూత్రం కొండలరావు, జలసూత్రం లక్ష్మీనారాయణ, జలసూత్రం నరసింహామూర్తి, జనసూత్రం లక్ష్మీనారాయణ, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ వ్యాలీ లో ఘనంగా మాతృబాషా దినోత్సవం




**రామకుప్పం, ఫిబ్రవరి 22 (జర్నలిస్ట్ ఫైల్)**

చిత్తూరు జిల్లా, రామకుప్పం మండల పరిధి రాజుపేట లో ఉండు గ్రీన్ వ్యాలీ పబ్లిక్ స్కూల్ లో ఘనంగా అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవం జరుపుకోవడం జరిగింది. విద్యార్థులు తెలుగు అనే ఆకారం తొ కూర్చోవడం ప్రత్యక ఆకర్షణంగా నిలిచింది.ప్రిన్సిపాల్ జ్యోతీశ్వర్ గాంధీ మాట్లాడుతూ మాతృభాష మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు మన వ్యక్తిత్వానికి ఆధారం. ప్రతి ఒక్కరూ తమ మాతృభాషను గౌరవంగా కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పై ఉంది అని తెలిపారు.ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ జ్యోతీశ్వర్ గాంధీ,ఇంచార్జి శ్రీనివాసులు,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన అధ్యాపక అభివృద్ధి శిక్షణా కార్యక్రమం



**మైలవరం, ఫిబ్రవరి 22 (జర్నలిస్ట్ ఫైల్)**

స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ( ఐక్యూఏసి ) వారి సంయుక్త ఆధ్వర్యంలో "ప్రభావవంతమైన బోధనా పద్ధతులు మరియు వినూత్న బోధనా వ్యూహాలు" అనే అంశంపై 5 రోజుల (ఫిబ్రవరి 16, 2026 నుండి ఫిబ్రవరి 20, 2026) ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ( ఎఫ్ డి పి ) ను నిర్వహించారు . ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. అప్పారావు , ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.పి. లోవరాజు , సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డా. వి. రామకృష్ణ ,కె. సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఏఐ ఌ డిఎస్ వక్తలు గా వ్యవహరించారు .నాలుగు రోజుల కార్యక్రమంలో వినూత్న బోధనా పద్ధతుల ద్వారా విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడం ,విద్యార్థుల అభ్యసన అనుభవాన్ని మెరుగుపరచడానికి, ఆధునిక పద్ధతులు, డిజిటల్ సాధనాలతో విద్యార్థులకు ఎలా బోధించాలో, అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ( ఓ బి ఈ ) బ్లూమ్స్ టాక్సోనమీ, ఐ సి టి ఇంటిగ్రేషన్ ఌ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు , యాక్టివ్ మరియు ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్ టెక్నిక్స్, ఎన్.బి.ఏ / ఎన్ ఏ ఏ సి ప్రమాణాలకు అనుగుణం గా మూల్యాంకన పద్ధతులు గురించి కళాశాల అధ్యాపకులకు వివరించారు. చివరి రోజున కళాశాలలో నిర్మించిన ఏఐసిటిఈ ఐడియా ల్యాబ్, ఇండస్ట్రీ ఇన్నోవేషన్ ల్యాబ్స్ ను సందర్శించారు . ఈ కార్యక్రమానికి కన్వీనర్ గా డా.కె.ఆర్.యల్.ప్రసాద్ , ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ .ఎస్.ఇంద్రసేనా రెడ్డి, శ్రీ.కె.సుధాకర్ కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

# మచిలీపట్నం ఎన్‌జీజీవో హోమ్ నిర్మాణాన్ని పూర్తిచేస్తాం





- ఉద్యోగులకు వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తాం
- మంత్రి కొల్లు రవీంద్ర సహకారం కోరాం
- ఏపీ ఎన్జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్

**మచిలీపట్నం, ఫిబ్రవరి 22 (జర్నలిస్ట్ ఫైల్)**

మచిలీపట్నం ఎన్‌జీజీవో హోమ్ నిర్మాణాన్ని పూర్తి చేసి, వీలైనంత త్వరగా ఉద్యోగులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషిచేస్తామని.. ఈ విషయంలో మంత్రివర్యులు కొల్లు రవీంద్రగారి సహకారం కోరడం జరిగిందని ఏపీ ఎన్జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ ఆధ్వర్యంలో జిల్లా ఎన్‌జీజీవో నాయకులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర గారిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రతి విషయాన్ని సావధానంగా విన్న మంత్రివర్యులు ఉద్యోగులు ప్రభుత్వం పట్ల ఎంతో సానుకూలంగా ఉన్నారని, ఉద్యోగులకు సంబంధించిన ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ ముందుకెళ్తామని స్పష్టం చేశారు.ఎన్ జి ఓ హోమ్ నిర్మాణం పూర్తి చేయడం ఉద్యోగుల సమస్యల పరిష్కారం లో తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మంత్రి తెలిపారు. అంతకుముందు మచిలీపట్నంలోని ఎన్జీవో హోం ఖాళీ స్థలాలను పరిశీలించి స్థానిక నాయకులతో విద్యాసాగర్ చర్చిం చారు. భవనాన్ని పూర్తిచేసేందుకు కృషిచేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన వివిధ సమస్యలపై ఉద్యోగులు విద్యాసాగర్‌కు వినతి పత్రాలు అందజేయగా.. వాటిని పరిశీలించి పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. గత ఆరేళ్లుగా ఉద్యోగ ులకు సంబంధించిన సమస్యలన్నీ పేరుకుపోయాయని, ఏడాది కాలంగా ఒక్కో సమస్యనూ పరిష్కారం చేసుకుంటూ వస్తున్నామని, దాదాపు 14 వేల కోట్ల రూపాయల బకాయిలను ఈ ప్రభుత్వంలో చెల్లించేట్లు చేసుకున్నామని, సంక్రాంతికి కూడా రూ. 1180 కోట్ల డిఎ, డిఆర్ ఎరియర్స్ ను ఉద్యోగులకు మరియు పెన్షనర్స్ కి చెల్లించేటట్లు చూడగలిగామని తెలిపారు. వేతన సవరణ కమిటీ చైర్మన్ ని నియమింప చేసుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా విద్యాసాగర్ అన్నారు. జిల్లా సంఘ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు ఏ విద్యా సాగర్ నిర్దేశించిన షెడ్యూల్లోపే భవాన్ని పూర్తిచేస్తామని, వారిచ్చిన స్ఫూర్తితో వివిధ సంఘాల సంఘ సభ్యుల మరియు తాలూకా సభ్యుల సహకారంతో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉద్యోగ ులకు ఉపయుక్తంగా ఉండేటట్లు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సంఘ భవనాలకు విరా ళాలు ప్రకటించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలోనే బిల్డింగ్ కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర కార్యాచరణతో ముందుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీజీవో రాష్ట్ర కార్యదర్శి రజనీష్ బాబు, కృష్ణాజిల్లా ఎన్‌జీజీవో సంఘ కార్యదర్శి సీతారామయ్య, కార్యవర్గ సభ్యులు ప్రకాష్, శోభన్ బాబు, లక్ష్మీ శ్రీనివాస్, శ్రీధర్ పెద్దసంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టులతోనే ప్రజలకు సమగ్ర అభివృద్ధి సాధ్యం

### సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి. కృష్ణ



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 22 (జర్నలిస్ట్ ఫైల్)**

ప్రజలకు సమానత్వం, సామాజిక న్యాయం, మౌలిక వసతులు కమ్యూనిస్టు సిద్ధాంతాల ద్వారానే సాధ్యమవుతాయని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి. కృష్ణ పేర్కొన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ కమ్యూనిస్టు తాత్వికులు కార్ల్ మార్క్స్, ఫ్రెడ్రిక్ ఎంగెల్స్ 1848 సంవత్సరంలో రచించిన 'కమ్యూనిస్టు ప్రకటన పత్రం' తొలి ప్రచురణ దినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21న నిర్వహించే 'రెడ్ బుక్ డే' కార్యక్రమాన్ని ఈ సందర్భంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో 'సామ్రాజ్యవాదం అత్యున్నత దశ' అనే గ్రంథంపై అధ్యయనం చేశారు.డి.వి. కృష్ణ మాట్లాడుతూ, సామ్రాజ్యవాద వ్యవస్థలో సంపద కొద్దిమందిలోనే కేంద్రీకృతమై అసమానతలు పెరుగుతున్నాయని అన్నారు. కార్పొరేట్ శక్తులు పాలకులను ప్రభావితం చేస్తూ సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్నాయని విమర్శించారు. ధరల పెరుగుదల, విద్యుత్ చార్జీల భారం ప్రజల జీవనాన్ని కష్టతరం చేస్తున్నాయని తెలిపారు. విదేశీ ఆర్థిక విధానాలు భారత వాణిజ్య, విద్య, ఔషధ రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. చదువుకోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులు భారీ ఖర్చులు భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.కమ్యూనిస్టు పాలనలో అసమానతలు తొలగించి అందరికీ ఉపాధి, విద్య, వైద్యం, సామాజిక న్యాయం కల్పించడం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని, భవిష్యత్తులో ప్రజల హక్కుల కోసం ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం. మహేష్, సీనియర్ నాయకులు ఎ. విఠల్ రావు, పట్టణ కమిటీ సభ్యులు ఎస్.కె. భాషా, కె. బేబీ సరోజిని, పి. నవీన్, పార్టీ సభ్యులు కె. నారాయణ, ఎస్. పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

### స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాన్ని

# సాధించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

- తెలుగుదేశం పార్టీ ఎన్నికల పోలింగ్ బూత్ యూనిట్ కన్వీనర్ ముని పోలిపల్లి
- భారీ ఊరేగింపుతో స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన సదస్సు



**కృష్ణలంక, ఫిబ్రవరి 22 (జర్నలిస్ట్ ఫైల్)**

గద్దె రామ్మోహన్ ఆదేశాల మేరకు శనివారం విజయవాడ తూర్పు నియోజకవర్గం 17వ డివిజన్‌లో రాణి గారి తోట, జండా చెట్టు ప్రాంతాల్లో భారీ ఊరేగింపుతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ ఎన్నికల పోలింగ్ బూత్ యూనిట్ కన్వీనర్ ముని పోలిపల్లి ఆధ్వర్యంలో, సచివాలయం పారిశుధ్య అధికారులు మరియు పారిశుధ్య కార్మికులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ముని పోలిపల్లి మాట్లాడుతూ, స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ కలలు కన్న పరిశుభ్రమైన భారతదేశాన్ని సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ నాగవంశం వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మొకర ఆదిబాబు మాట్లాడుతూ, పారిశుధ్య సాధన దిశగా ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. 2014 అక్టోబర్ 2న ప్రధానమంత్రి మోడీ నాయ కత్వంలో ప్రారంభమైన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, అదే స్ఫూర్తితో రాష్ట్రంలో పరిశుభ్రత కార్యక్రమాలు కొనసాగుతు న్నాయ ని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 1995లోనే పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టి సారించారని గుర్తుచేశారు. పరిసరాల పరిశుభ్రత, బహిరంగ మలవిసర్జన నిర్మూలన వంటి కార్యక్రమాలు సమాజంలో మార్పు తీసుకువచ్చాయని తెలిపారు. ఇంకా మన పరిసరాల్లో పూర్తిస్థాయి పరిశుభ్రత సాధించాల్సి ఉందని, జపాన్ వంటి దేశాల్లో ప్రజలు రోడ్లపై చెత్త వేయరని ఉదాహరణ ఇచ్చారు. మనం కూడా అలవాట్లు మార్చుకొని పరిశుభ్రమైన వాతావరణాన్ని సృష్టించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటేశ్వరరావు (కొండ), చింత గోపి, దైద మహేష్, మందులు వీరస్వామి (భద్ర), గోపాలదాస్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న లంక లితిష్

### చిన్నారి పూనర్వికకు ఆర్థిక చేయూత




**మైలవరం, ఫిబ్రవరి 22 (జర్నలిస్ట్ ఫైల్)**

చిన్నారి పూనర్వికకు ఎస్ ఏం ఏ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న సమాచారం తెలిసిన వెంటనే స్పందించి చిన్నారి పునర్వికాకు తెలుగు యువత అధ్యక్షు లు లంక లితీష్ శనివారం పదివేల రూపాయిలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం మాట్లా డు తూ చిన్నారి పునర్వికాకు వచ్చిన ఈ వ్యాధికి,అత్య వసర చికిత్స, అధిక మొత్తంలో ఖర్చుతో వుందని . చి న్నారి చికిత్స నిమిత్తం సొసైటీ నీడ్స్ యూ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫండ్స్ కలెక్షన్ చేస్తున్నం దున, మీరు చేసే సహాయం ఈ చిన్నారి పెద్ద జీవితవ ని, ఈ చిన్నారి కి చేసే ఇంజక్షన్ ఎక్కువ ఖర్చుతో ఉందని , ఈ చిన్నారి పునార్విక విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## రంగారెడ్డి జిల్లా జాగృతి ఎస్.సీ విభాగం అధ్యక్షుడిగా నాగని ప్రకాశ్ నియామకం

### – జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి.



రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ దీవెనలతో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి జాగృతి జిల్లా ఎస్.సి విభాగం అధ్యక్షుడిని నియమించారు. రాజేంద్రనగర్ నియోజక వర్గ నాయకులు చలసాని విష్ణుమూర్తి సూచన మేరకు ?తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా జాగృతి ఎస్.సీ విభాగం అధ్యక్షుడిగా రాజేంద్రనగర్ నియోజకవర్గం శివరాంపల్లికి చెందిన నాగని ప్రకాశ్ ను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.?ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ..సామాజిక తెలంగాణ లక్ష్యంగా ఎస్.సీ వర్గాల అభ్యున్నతికి,వారి సమస్యల పరిష్కారానికి తెలంగాణ జాగృతి ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.?నాడు ఉద్యమ సమయంలోనే కాకుండా,నేడు సామాజిక మార్పు కోసం కవితమ్మ నాయకత్వంలో ఎస్సీ విభాగం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.?కొత్తగా నియామకమైన అధ్యక్షుడు జిల్లావ్యాప్తంగా ఉన్న ఎస్సి యువతను,ఎస్సి సామాజిక శ్రేయోభిలాషులను ఏకం చేస్తూ జాగృతి బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.నామిని ?ప్రకాశ్ నియామకం పట్ల జిల్లాలోని తెలంగాణ జాగృతి నాయకులు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.కవితమ్మ ఆశయాలకు అనుగుణంగా,అణగారిన వర్గాల గొంతుకగా ఈ విభాగం పనిచేస్తుందని కప్పాటి పాండురంగారెడ్డి చలసాని విష్ణుమూర్తి ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాగని ప్రకాశ్ మాట్లాడుతూ..జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నాకు పదివిని ఇవ్వడానికి కృషిచేసిన విష్ణుమూర్తికి జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డికి తోటి జాగృతి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

## బీజేపీ ఎమ్మెల్యే నివాసంపై దాడి యత్నం ప్రజాస్వామ్యంపై దాడి

### బిజెపి రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి



షాద్నగర్ నియోజకవర్గం ఫిబ్రవరి 22 (జర్నలిస్ట్ ఫైల్) : భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి యత్నించడాన్ని రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఒక ప్రజాప్రతినిధి ఇంటిపై దాడి చేయడానికి ప్రయత్నించడం అధికార కాంగ్రెస్ అహంకారానికి, దుర్మార్గపు రాజకీయాలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని, విభిన్న అభిప్రాయాలను సహించలేని స్థితిలో అధికార పక్షం ఉందని విమర్శించారు. వెంకట రమణారెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించలేక, ఆయన నివాసంపై రౌడీ మూకలను పురమాయించడం కాంగ్రెస్ ప్రతీకార రాజకీయానికి అద్దం పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి లో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మరియు రేవంత్ రెడ్డిలను ఓడించడాన్ని జీర్ణించుకోలేక, ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీని ఒంటరిగా ఎదుర్కోలేక కాంగ్రెస్ మరియు భారత్ రాష్ట్ర సమితి కలిసి కక్ష రాజకీయాలకు పాల్పడుతున్నాయని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ఆరోపించారు. ప్రజల తీర్పును గౌరవించడం నేర్చుకోవాలని, హింసా రాజకీయాలను తక్షణమే నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో బీజేపీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు

## మండల కేంద్రంలో బాధిత కుటుంబలను పరామర్శించిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి ఇందల్ వాయి మండలం ఫిబ్రవరి 22 (జర్నలిస్ట్ ఫైల్) : ఇందలువాయి మండల కేంద్రంతోపాటు, చంద్రయన్ పల్లి గ్రామంలో సీనియర్ నాయకులు కుమ్మరి గంగాధర్ తల్లి ఇటీవల మరణించినందున వారిని అలాగే గంది తండలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించినందున వారి కుటుంబాన్ని మరియు ఇందలువాయి తండలో కాంగ్రెస్ సీనియర్ నాయకులైన ముడవత్ నారాయణ నాయక్ మరియు బాదవత్ వసంత్ మాతృమూర్తులు ఇటీవల మృతి చెందినందున వారిని పరమర్శించాడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇందలువాయి మండల పార్టీ అధ్యక్షులు మోతుకూరి నవీన్ గౌడ్, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, అన్ని గ్రామల సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

### జాతీయ అవార్డు గ్రహీతలు,ప్రజా ప్రతినిధులకు సత్కారం,




షాద్ నగర్ నియోజకవర్గ ఫిబ్రవరి 22 (జర్నలిస్ట్ ఫైల్) : షాద్‌నగర్ డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజా సేవా రంగంలో విశిష్ట సేవలందించిన జాతీయ అవార్డు గ్రహీతలు మరియు ప్రజా ప్రతినిధులకు ఘన సత్కార కార్యక్రమం వైభవంగా నిర్వహించబడింది అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ వోగ్గు కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సభ్యులు శ్రీ వెంకటయ్య,శ్రీ వహాబ్ సర్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్ మరియు (ఎన్‌హెచ్‌ఆర్‌సీసీబీ) సభ్యులు అయిన శ్రీ లక్కకుల అనిల్ కుమార్ కి సంస్థ ప్రదానం చేసిన ప్రతిష్టాత్మక నేషనల్ లీడర్షిప్ అవార్డు అందుకున్నందుకు అసోసియేషన్ సభ్యులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు మానవ హక్కుల పరిరక్షణ సామాజిక న్యాయం మరియు ప్రజా సేవలో ఆయన చూపుతున్న నాయకత్వం షాద్‌నగర్ మరియు తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని కొనియాడారు అదేవిధంగా డాక్యుమెంట్ రైటర్‌గా సేవలందిస్తూ ఇటీవల కౌన్సిలర్‌గా ఎన్నికైన శ్రీ వోగ్గు కిషోర్ కి అభినందనలు తెలిపారు డాక్యుమెంట్ రైటర్‌గా కొనసాగుతూ డిప్యూటీ సర్పంచ్‌గా ఎన్నికైన శ్రీ అభినవ్ కి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ డాక్యుమెంట్ రైటర్స్ సమాజం ప్రజా జీవితంలో కీలక పాత్ర పోషిస్తోందని ఈ నాయకుల విజయాలు యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు వారి నాయకత్వంలో షాద్‌నగర్ ప్రాంతం అభివృద్ధి దిశగా మరింత వేగంగా ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అడ్డెట్ల రాజు, శ్రీకాంత్ రెడ్డి,వహాబ్ ఖాన్,వెంకటయ్య, నరేష్,సంతోష్,విజయ్,రవి,నాగరాజు, శ్రీహరి,చందర్,రాజు, తదితరులు పాల్గొన్నారు,

## మంథనికి ఈనెల 24 న గరికపాటి నరసింహారావు



మంథని, ఫిబ్రవరి 22 (జర్నలిస్ట్ ఫైల్) : మంథని పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈనెల 24 న మంగళవారం గరికపాటి నరసింహారావు ప్రవచనాల సందర్భంగా కార్యక్రమ ఏర్పాట్లను దగ్గర ఉండి పనులు చేపిస్తున్న శ్రీ కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ అవదాని మోహన్ శర్మ , సువర్ణ గణపతి, లోకే రాధా కిషన్, కొంతం సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకుడు బెజ్జంకి డిగంబర్ తదితరులు ఉన్నారు.

# ఫోన్ యాప్ ద్వార ఆన్ లైన్ సిస్టమ్ బంద్ చేసి, రైతులకు పాత పద్ధతిలోనే యూరియ సప్లై చేయాలి

### ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య.



నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి సిరికొండ మండలం ఫిబ్రవరి 22 (జర్నలిస్ట్ ఫైల్) : యూరియ పంపిణీలో ఫోన్ యాప్ ద్వార ఆన్‌లైన్ సిస్టమ్ ఆప్ చేసి పాత పద్ధతిలో రైతులకు యురియ అందజేయలని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలోని అధికారి సౌమ్యకి ఎఐకెఎంఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతు జిల్లాలో యూరియ కొరత రైతులను తీవ్రంగా వేధిస్తుంది. యూరియ కొరకు రైతులు ఇబ్బందులు, తిప్పలు




పడుతున్నారు అని వారన్నరు . ప్రభుత్వం తీసుకోవచ్చిన స్మార్ట్ ఫోన్, పెద్దఫోన్‌లో, యాప్ ద్వార యూరియను ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకొమని చెబుతున్న అధికారులు అందరికి పెద్దఫోను ఎక్కడివి అని వారు ప్రశ్నించారు. రైతులకి చిన్న ఫోన్లు ఉన్నాయి. పెద్ద ఫోన్‌తో బుక్ చేసుకొందమన్న అన్ని భూములు ఆన్‌లైన్ లో ఎక్కలేవు. అందువల్ల ఉన్న ఫోన్‌లకు భూమి చుయించదు. ఒకవేళ జిల్లాలో ఎక్కడైన ఆన్‌లైన్ బుక్ చేసుకున్న రైతులు సొసైటీలు, పంపిణీ కేంద్రాల వద్ద వెళ్లేలోపు స్టాక్ చూపించిన బస్తాల స్థానంలో '0' చూయిస్తుంది. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నరని వారు అన్నారు. అంత దూరం అవస్థపడి వెళ్లిన రైతులకు నిరాశ మిగులుతుంది. స్థానికంగా వుండే రైతుకు సమాచారం తెలిసిన వెంటనే బుక్ చేసుకోవడం తెలియక యూరియ దొరకడం లేదు. ముందుగా ఏ మండలం ఏ సొసైటీ పరిధిలో ఉన్న స్థానికంగా ఉన్న రైతులకు అదె విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవలని వారన్నారు. యూరియ స్టాకు చూయించిన కేంద్రంలో పట్టుమని 10నిమిషాలు కూడ యురియ బస్తాలు ఉండడం లేదు. అయిపోయిందని బస్తాలు '0' చూయిస్తుంది. దీనివల్ల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నరు. నిరశతో ఇంటికి వెనుదిరుగుతున్నరు. అని వారన్నరు. రైతుకు ఈ సమయంలోనే యూరియ అత్యంత అవసరం కావున ప్రభుత్వం ముందుగా తగినంత యూరియను జిల్లాకు తెప్పించాలని అడిగిన రైతులకు సరిపడ అందజేయలి. ఈ కొత్త పద్ధతి ఫోన్ యాప్ ఆన్‌లైన్ బుకింగ్ సిస్టమ్ వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నందున దానిని వెంటనే ఆపివేయలని వారు ప్రభుత్వని డిమాండ్ చేశారు. పాతపద్ధతిలో రైతులకు పాస్‌బుక్ ద్వార యూరియను అందజేయలి. కౌలు రైతులకు కూడ గ్రామ కార్యదర్శి ధృవీకరణ పత్రం ద్వార అందజేయలని వారు ప్రభుత్వని కోరారు. ఈ కార్యక్రమం దేశెట్టి సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఏ.చిన్నయ్య, వి.సాయిలు, శంకర్, దేవన్, వి.గంగారాం, కే.గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## అనంతగిరిలో కాంగ్రెస్ "సంఘటన సృజన్ అభియాన్" శిక్షణా శిబిరం ప్రారంభం

### ప్రారంభించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




(జర్నలిస్ట్ ఫైల్) వికారాబాద్ ఫిబ్రవరి 22 : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో పార్టీ బలోపేతానికి దోహదపడే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "సంఘటన సృజన్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పది రోజుల శిక్షణా శిబిరం శనివారం ఘనంగా ప్రారంభమైంది. వికారాబాద్ జిల్లా అనంతగిరిలోని హరిత రిసార్ట్లో ఏర్పాటు చేసిన ఈ శిబిరం కాంగ్రెస్ పార్టీకి కీలకమైన రాజకీయ, సంఘటనాత్మక మార్గదర్శక వేదికగా నిలుస్తోంది. ఈ కార్యక్రమానికి



ముఖ్య అతిథిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఆయనతో పాటు టీపీసీసీ అధ్యక్షులు మరియు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీ చందర్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కేడర్ శిక్షణ అత్యంత అవసరమని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విజయానికి కేవలం ఎన్నికల సమయంలో చేసే ప్రచారం సరిపోదని, సిద్ధాంతాలపై స్పష్టత, నాయకత్వ నైపుణ్యాలు, ప్రజలతో మమేకం అయ్యే సామర్థ్యం వంటి అంశాలు కీలకమని పేర్కొన్నారు. శిక్షణా శిబిరం ద్వారా జిల్లా అధ్యక్షులు పార్టీ సిద్ధాంతాలు, విధానాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కార విధానాలపై సమగ్ర అవగాహన పొందుతారని తెలిపారు. ఈ శిబిరంలో ముఖ్యంగా డిసిసి అధ్యక్షుల పాత్రపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాల డిసిసి అధ్యక్షులు పార్టీకి కేవలం నిర్వాహకులు మాత్రమే కాకుండా సిద్ధాంతాల వారధులని నాయకులు పేర్కొన్నారు. వారు గ్రామ స్థాయిలో పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రధాన బాధ్యత వహిస్తారని, పార్టీ–ప్రజల మధ్య అనుసంధానంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. జిల్లాల్లో పార్టీ నిర్మాణం, బూత్ స్థాయి బలోపేతం, యువత–మహిళల భాగస్వామ్యం పెంపు వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. పది రోజుల పాటు కొనసాగే ఈ శిబిరంలో రాజకీయ అవగాహనతో పాటు మీడియా నిర్వహణ, ఎన్నికల వ్యూహాలు, సోషల్ మీడియా వినియోగం, ప్రజా సమస్యల పరిష్కార విధానాలు, నాయకత్వ అభివృద్ధి వంటి అంశాలపై నిపుణుల ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. దీంతో డిసిసి అధ్యక్షులు తమ తమ జిల్లాల్లో పార్టీని మరింత సమర్థవంతంగా ముందుకు నడిపించగలరని పార్టీ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా అనంతగిరిలో ప్రారంభమైన ఈ శిక్షణా శిబిరం కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్ ఎన్నికల దృష్ట్యా కీలక మైలురాయిగా నిలుస్తూ, జిల్లాల స్థాయిలో పార్టీ పునర్వ్యవస్థీకరణకు బలమైన పునాది వేస్తుందని నాయకులు పేర్కొన్నారు.

## రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల పట్ల హర్షం వ్యక్తం చేసిన సర్పంచుల ఫోరం



నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి ధర్పల్లి మండలం ఫిబ్రవరి 22 (జర్నలిస్ట్ ఫైల్) : ధర్పల్లి మండలానికి కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను విడుదల చేయడం పట్ల మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సిహెచ్. శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ విడుదలైన నిధులను సర్పంచులు గ్రామాల్లోని మౌలిక వసతుల కల్పనకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అయితే ప్రభుత్వం ఇంకా బాకీ ఉన్న మిగిలిన నిధులను కూడ తక్షణమే విడుదల చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

## ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన మున్సిపల్ చైర్మన్ గడ్డం అనన్య



(జర్నలిస్ట్ ఫైల్) వికారాబాద్ ఫిబ్రవరి 22: వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహిస్తున్న డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరం కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికారాబాద్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్ఏపీ కాలేజీ ప్రాంగణంలోని హెలిప్యాడ్ వద్ద వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పిన్న వయస్సులోనే మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికై సేవలు అందిస్తున్న గడ్డం అనన్యను ముఖ్యమంత్రి అభినందిస్తూ, ఆమె ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి గడ్డం అనన్య ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. వికారాబాద్ పురపాలక సంఘం పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు–డ్రైనేజీలు, వీధిదీపాలు, తాగునీటి సదుపాయాలు వంటి పనులను వేగవంతంగా చేపట్టేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. అభివృద్ధి కార్యక్రమాలపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి, వికారాబాద్ పట్టణాభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మైనారిటీ నాయకులు..



కూకట్ పల్లి (జర్నలిస్ట్ ఫైల్) : కూకట్ పల్లి హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదిన సందర్భంగా కూకట్ పల్లి ముస్లిమ్ మైనరీటీ సెల్ నాయకులు , సోషల్ మీడియా కన్వీనర్ మహ్మద్ అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయనను కలిసి శాలువాలతో సత్కరించి భుజం కి దట్టి కట్టారు. నిత్యం ప్రజలతో మమేకం అయి ప్రజా సేవకుడుగా ప్రజల హృదయాలయని గెలుచుకున్న ప్రజా నాయకుడు నిండు నూరేళ్ళు వర్ధిల్లాలి అని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారికి ధన్యవాదములు తెలియజేశారు.

## ఘనంగా బిజెపి నేత పార్నంది నాగులు జన్మదిన వేడుకలు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు..



శేరిలింగంపల్లి ఫిబ్రవరి 22(జర్నలిస్ట్ ఫైల్): రంగారెడ్డి జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు , మహాత్మా గాంధీ జాతీయ అవార్డు గ్రహీత బిజెపి పార్టీ నాయకులు పి. నాగులు జన్మదిన వేడుకలు మియాపూర్ న్యూ కాలనీ లోనీ ఆయన నివాసంలో పుర ప్రముఖులు,అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు వారిని కలిసి శాలువాలతో సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు ఎ. లక్ష్మణ్ ,మాణిక్ రావు రంగా రెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఓబీసీ సెల్ ప్రెసిడెంట్ రాచమల్ల నాగేష్ గౌడ్, కాంగ్రెస్ నేత మోహన్ ముదిరాజ్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులుకిరణ్ యాదవ్, బిజేపీ నేతలు మహేష్ యాదవ్, పట్టాభిరామ్, గుండె గణేష్ ముదిరాజ్, అట్టేపల్లి లక్ష్మీ నారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ రామ ప్రభు లు ఈ కార్యక్రమంలో భాగంగా పి. నాగులు కు పూలగుచ్చాలు అందించి, శాలువాలతో సన్మానించారు. అలాగే బిజెపి యువజన విభాగం సభ్యులు భారీ పూదీనామాల తో వారిని ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో



### సన్మానించిన యువ నాయకులు

శివ, జ్ఞాని, మోహంతి, కిట్టు అన్న, అఖిల్, సత్తి, నవీన్ , జొంటి, భరత్, లకణ్ కుమార్, రాకేష్ కుమార్, చోటా రామ్ బావారి శ్రీ రాముని ప్రతిమను బహుకరించారు. ఈ శుభ సందర్భం ను పురస్కరించుకొని పటాన్ చెరు పద్మశాలి సంఘం జనరల్ సెక్రటరీ, టి ఆర్ పి ఎస్ జాయింట్ సెక్రటరీ వై. వెంకట రమణ ని ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం సామాజిక బాధ్యతగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.దివ్యాంగులకు దుస్తుల పంపిణీ అర్హులైన దివ్యాంగులకు దుస్తుల ను అందజేశారు.అన్నదానం పేద ప్రజల ఆకలి తీర్చదానికి అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు.

## బ్రాహ్మ కుమారిస్ అద్వర్యంలో రక్తదాన శిబిరం..పాల్గొన్న రామప్రభు ..



శేరిలింగంపల్లి(జర్నలిస్ట్ ఫైల్): హుడా కాలనీ బ్రాంచ్ ఆధ్వర్యంలో బ్రాహ్మ కుమారిస్ సంస్థ రక్తదాన శిబిరాన్ని చందానగర్ డివిజన్ లోని దీప్తి శ్రీ నగర్ లో విజయవంతంగా నిర్వహించింది. ఈ శిబిరం సమాజ సేవా భావంతో, ప్రాణాలను రక్షించాలనే మహత్తర లక్ష్యంతో నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అట్టేపల్లి లక్ష్మీ నారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ అట్టేపల్లి రామప్రభు హాజరై రక్తదానం చేసిన దాతలను అభినందించారు. రక్తదానం మహాదానం అని, ప్రతి యువకుడు సమాజ సేవలో భాగస్వామి కావాలని ఆయన సూచించారు.ఈ శిబిరం నిర్వహణలో సిస్టర్ శైలజ ముఖ్య పాత్ర పోషించారు. మొత్తం 25 మంది దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఈ మహత్తర సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన దాతలకు, వాలంటీర్లకు మరియు సహకరించిన అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# నూతన మఠాధిపతి దంపతులకు పట్టాభిషేక పట్టువస్త్రాల సమర్పణ



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్): శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం వంశపారంపర్య 8 వ తరం 12వ మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి పట్టాభిషేక మహోత్సవానికి అమరావతి బ్రహ్మం దంపతులు మరియు కుటుంబ సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించారు. పట్టాభిషేక మహోత్సవంలో మఠాధిపతి దంపతులు ధరించే పట్టు వస్త్రాలు సమర్పించే కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షులు అయ్యపు సురేష్ బాబు మాజీ అధ్యక్షులు బన్నూరు కృష్ణమూర్తి మాజీ కమిటీ సభ్యులు మహిళలు పాల్గొని సాంప్రదాయ ఆధ్యాత్మిక పద్ధతిలో వేడుకగా నిర్వహించారు.

# బాధిత కుటుంబానికి అండగా టీడీపీ



## ○ రూ. 5 లక్షల బీమా చెక్కు అందజేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ): వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో బొల్లాపల్లి మండలం, రేమడిచర్ల గ్రామానికి చెందిన భూక్య తాసిల్ నాయక్ ఇటీవల విద్యుత్ ప్రమాదానికి గురై దురదృష్టవశాత్తు మరణించారు. కేవలం 100 రూపాయలకే టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. ఆ సభ్యత్వం ద్వారా లభించే ప్రమాద బీమా సౌకర్యం ఇప్పుడు ఆయన కుటుంబానికి కొండంత అండగా నిలిచింది. రూ. 5,00,000 (అక్షరాలా ఐదు లక్షల రూపాయలు)మృతుని భార్య మంగా భాయి కి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అందజేశారు. వారు మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలకు, సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ఆపద కాలంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కేవలం వంద రూపాయల సభ్యత్వంతో ఐదు లక్షల రూపాయల బీమా అందడం అనేది పార్టీకి కార్యకర్తలపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



## ○ కాకుమాను పిహెచ్‌సిలో స్వచ్ఛ ఆంధ్ర

కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ):ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పట్ల శ్రద్ధ కలిగి ఉండాలని కాకుమాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యధికారి డా స్వర్ణ రాజశేఖర్ తెలిపారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణంధ్ర కార్యక్రమం లో భాగంగా వైద్య శాల పరిసరాలను సిబ్బంది శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వైద్యధికారి డా. రాజశేఖర్ మాట్లాడుతూ ఇండ్ల పరిసరాలలో పరిసరాలను ఎపటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. పరిసరాలు శుభ్రం గా ఉండడం వలన ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన స్వచ్ఛంధ్ర స్వర్ణంధ్ర కార్యక్రమం లో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం అవ్వాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన సమాజమే లక్ష్యంగా ప్రజలు బాధ్యత కలిగి ఉండాలన్నారు. సిబ్బంది చే స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరు ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. వైద్యశాలకు వచ్చే వ్యక్తులు మరియు సిబ్బంది ఎపటికప్పుడు వ్యర్థాలను కేటాయించిన డస్ట్ బిన్ లో మాత్రమే వేయాలని సూచించారు. జిల్లా ఉన్నతధికారుల ఆదేశాలు, సూచనలు పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మఠాధిపతులతో శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల విద్యార్థులు



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ): బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం నాడు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం మఠాధిపతులు శ్రీ శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి ఆశీర్వచనములు తీసుకున్నారు ఈ సందర్భంగా సోమవారం నుండి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష రాస్తున్న విద్యార్థులంతా కూడా ఉత్తమ ఫలితాలను సాధించి కళాశాలకు ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని స్వామి వారు విద్యార్థులను ఆశీర్వదించారు అనంతరం విద్యార్థులు శ్రీ ఈశ్వరీ దేవి మఠమునకు వెళ్లి అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి అనంతరం మఠాధిపతులు శ్రీ వీర శివకుమార్ స్వాములు వారిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి ఆశీర్వచనములు విద్యార్థులు తీసుకున్నారు స్వామి వారి విద్యార్థులతో ఈ కళాశాలకు ఎంతో ప్రాముఖ్యత కలిగినటువంటి కళాశాల ఇటువంటి కళాశాలలో మీరు చదువుతున్నారంటే చాలా ఉన్నతమైన ఆలోచనతో ఉన్న విద్యార్థులని తాము కూడా గతంలో ఇదే కళాశాలలో పూర్వపు విద్యార్థులుగా విద్యను అభ్యసించామని సోమవారం నుంచి పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ కూడా శుభము కలగాలని ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధించాలని ఏకాగ్రతతో మనసును అదుపులో ఉంచుకొని పరీక్షల సమయంలో మీ ఆలోచన చదువు మీదే ఏకీకృతం చేయాలని విద్యార్థులకు ఆయన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ముండ్లపాటి చంద్రశేఖర్ అధ్యాపకులు ముడియం గురు స్వప్న గొడ్ల వీరలక్ష్మి శారద,బాల సుబ్బయ్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు .

# హ్యాపి సండే సంబరాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): మనతోటి వారితో సంతోషాలు పంచుకోవడం సామాజిక భాగ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు పురపాలక సంఘ పరిధిలో హ్యాపీ సండే కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

స్థానిక చినరావూరు పార్కు సెంటర్లో ఆదివారం, తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాపీ సండే కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గేయాలు,చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆహ్లాదంగా పాల్గొన్న కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ సమాజంలో ఇటువంటి కార్యక్రమాల ద్వారా సెలవు దినాల్లో విద్యార్థులకు చక్కని ప్రోత్సాహం లభిస్తుంది అన్నారు. వారిలోని ప్రతిభను చాటుకుంటూ నిర్వహించిన కార్యక్రమాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇటువంటి కార్యక్రమాలను మరింతగా ప్రోత్సహించి, ఎక్కువ మందికి అవకాశం కల్పించడమే కార్యక్రమ ఉద్దేశం అన్నారు. తెనాలి పట్టణానికి, సాంస్కృతిక అంశాల పట్ల ఉన్న గత చరిత్రను గుర్తు చేసుకుంటూ, మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# చేనేతకు చట్టబద్ధ హామీలు అమలు చేయాలి

## ○ మంగళగిరి చేనేత గర్జన సభలో నేతన్నల డిమాండ్

## ○ హక్కుల సాధనకై వేలాదిమంది నేతన్నల ర్యాలీ



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): చేనేత రంగాన్ని తక్షణమే ఆదుకోవాలని, సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ పిల్లలమర్రి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి నేతన్న సర్కిల్ వద్ద ఆదివారం చేనేత గర్జన సభ ఐక్య చేనేత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేత రంగ సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం చేనేత రంగానికి రూ.115 కోట్లు మాత్రమే కేటాయించడం చిన్నచూపు చూపడమేనని పేర్కొన్నారు. సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.203 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర బడ్జెట్లో కనీసం రూ.25 వేల కోట్లు చేనేత రంగానికి కేటాయించాలని, కనీసం రూ.2 వేల కోట్లు కేటాయించి సకాలంలో నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు ప్రతి ఏటా 25 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాలని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 1995 హ్యాండ్లూమ్ రిజర్వేషన్ చట్టంలోని 11 రకాల రిజర్వేషన్లను కఠినంగా అమలు చేయాలని, ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చేనేత సహకార సంఘాలకు పెండింగ్ నిధులు తక్షణమే విడుదల చేసి, కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలని కోరారు.

**హ్యాండ్లూమ్ బోర్డును పునరుద్ధించాలి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ కో కన్వీనర్లు బండారు ఆనందప్రసాద్, పిల్లలమర్రి బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలు చేనేత వస్త్రాలనే వినియోగించాలని, ప్రతి చేనేత కుటుంబానికి మూడు సెంట్ల భూమి కేటాయించి హౌస్ కమ్ వర్క్ షెడ్లు నిర్మించాలని, అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలని వారు సూచించారు. కేంద్ర స్థాయిలో హ్యాండ్లూమ్ బోర్డును పునరుద్ధరించాలని ప్రభుత్వాలను కోరారు.

**చేనేత కార్మికుల ప్రదర్శన**

తొలుత మంగళగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుండి గౌతమబుద్ధారోడ్డు నేతన్న సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు కట్ట దుర్గారావు, వి రమేష్, కృష్ణ ప్రసాద్, మాచర్ల మోహన్, దేవన వీర నాగేశ్వరరావు, రామనాథం పూర్ణచంద్రరావు, రాపోలు జగన్, నీలూరి రూప్యాంగప్ప, కూరపాటి కోటేశ్వరరావు, కాసుల రవికుమార్, రాష్ట్ర వ్యాప్తంగా చేనేత నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పెళ్ళి పేరుతో యువతిని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

## ○ త్రీటౌన్ సి ఐ ఎస్. సాంబశివరావు



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): మ్యాట్రిమోనియల్ పరిచయాన్ని ఆసరాగా చేసుకుని, పరిచయాన్ని పెంచుకుని, పెళ్ళి చేసుకుంటానని నమ్మబలికించి, అన్ని విధాలుగా తన అవసరాలు తీర్చుకున్న ఆ ప్రబుధ్ధుడు, పెళ్ళి విషయంలో ఒత్తిడి పెరగడంతో, ఆమహిళను బ్లాక్ మెయిల్ చేయడంతో, విధిలేని పరిస్థితుల్లో బాదిత మహిళ పోలీసులను ఆశ్రయించగా, ఆమోసగాడిని అదుపులోకి తీసుకున్నట్లు త్రీ టౌన్ సి ఐ ఎస్. సాంబశివరావు పేర్కొన్నారు.

ఆదివారం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో, ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సి ఐ ఎస్. సాంబశివరావు కదనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి...

కొల్లిపర మండలం కొత్తూరులంక గ్రామానికి చెందిన అరవపల్లి వంశీ అనే ప్రభుద్దుడు, పట్టణంలోని ఓ ప్రేవేటు కంపెనీలో జాబ్ చేస్తున్న మహిళతో, మ్యాట్రమోనియల్ ద్వారా ఆన్ లైన్ లో,పరిచం చేసుకున్నాడు. ఆతర్వాత ఆమె వివరాలు తెలుసుకుని నేరుగా ఆమె పనిచేసే కార్యాలయానికి వెళ్ళాడు. ఆపరిచంతో ఆమె ఇంటికి వెళ్ళాడు. ఆమె కుటుంబ సభ్యులను, తనదైన మోసపూరిత మాటలతో, ఆమహిళను వివాహం చేసుకుంటానని నమ్మించాడు. ఈక్రమంలో ఆమహిళ ద్వారా, ఆమె కుటుంబ సభ్యుల షూరిటితో, టిప్పర్ కొంటున్నా నంటు, బ్యాంకు రుణం 12లక్షలు వరకు తన ఖాతాలోకి ఆన్ లైన్ ఖాతాను నడిపించాడు. కాబోయే శ్రీవారని, ఆమహిళ, ఆమె కుటుంబ సభ్యులు పూర్తిగా నమ్మిన క్రమంలో, తన అవసరాలు అన్ని విధాలుగా తీర్చుకున్న, వంశీ,మొహం చాటేశాడు. మోసపోయామని తెలుసుకున్న బాదిత మహిళ త్రీ టౌన్ లో పిర్యాదు చేయగా. ఆదివారం వంశీని అరెస్ట్ చేసిన సి ఐ. ఎస్. సాంబశివరావు, తమ విచారణలో లభించిన సమాచారం వివరించారు. సదరు వంశీ, పెళ్ళి పేరుతో ఆడపిల్లలను తన ట్రాప్ లోకి తెచ్చుకుని, వారి నుండి నగలు, నగదు మంచిగానే తీసుకుని మోసం చేస్తాడన్న విషయాన్ని గుర్తించామన్నారు. ఇప్పటి వరకు ఐదుగురు ఇలా మోసపోయారని,నిందితుడ్ని కోర్టుకు హాజరు పర్చునున్నట్లు తెలిపారు. అదేవిధంగా మ్యాట్రిమోనియల్ పరిచాలతొ మోస పోవద్దని, కల్లబొల్లి మాటలు నమ్మి, మోసపోయేవారుంటే, మోసం చేసే వంశీ వంటి వారు సిద్దంగా ఉంటారని సి ఐ. సాంబశివరావు ప్రజలకు సూచించారు. నిందితుడిని మీడియా ముందు . ఈసమావేశంలొ స్టేషన్ ఎస్సై లు, సిబ్బంది ఉన్నారు.

# విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా థింగ్‌క్యూబేటర్ ఎక్స్‌పర్ట్ మీట్



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలోని డీన్ ఏఏఏ--ఎఫ్ఏ కార్యాలయం, విజ్ఞాన్స్ టీబీఐ కౌన్సిల్, ఈ--సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నాస్కామ్ ఫౌండేషన్, సిస్కోల ఆర్థిక సౌజన్యంతో కోహోర్ట్-9 కోసం నిర్వహించిన "థింగ్‌క్యూబేటర్ ఎక్స్‌పర్ట్ మీట్" ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో సామాజిక ఆవిష్కరణలు పెంపొందించి, ప్రారంభ దశ ఆలోచనలను సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలుగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాస్కామ్ ఫౌండేషన్ --సోషల్ ఇన్నోవేషన్ ఫర్ యూత్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ శ్రేయ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు థింగ్‌క్యూబేటర్ కార్యక్రమం ద్వారా లభించే అవకాశాలు, ఎంపిక విధానం, ప్రాజెక్ట్ అభివృద్ధి దశలు తదితర అంశాలను వివరించారు. విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో సామాజిక సమస్యలకు పరిష్కారాలుగా మలచుకోవాలని సూచించారు. సిస్కో సిస్టమ్స్, నాస్కామ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న థింగ్‌క్యూబేటర్ ప్రోగ్రామ్ దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన విద్యార్థి ఆవిష్కర్తలను గుర్తించి ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపికైన 100 మంది విద్యార్థి ఆలోచనలకు ప్రోటోటైప్ అభివృద్ధికి సాంకేతిక సహాయం అందించబడుతుందన్నారు.

వాటిలో అత్యుత్తమంగా నిలిచిన 10 జట్లకు ప్రతి జట్టుకు రూ.5 లక్షల వరకు ప్రత్యేక నిధులు అందించి వారి ఆవిష్కరణలను విస్తృత స్థాయిలో అమలు చేసే అవకాశం కల్పించబడుతుందన్నారు. గత కోహోర్ట్‌లో విజ్ఞాన్స్ యూనివర్సిటీకి చెందిన మూడు విద్యార్థి బృందాలు ప్రోటోటైపింగ్ గ్రాంట్‌లు పొందారని, ఇది విద్యార్థుల్లో ఉన్న ఆవిష్కరణాత్మక సామర్థ్యాన్ని, విజ్ఞాన్ అందిస్తున్న మార్గదర్శకత్వాన్ని స్పష్టంగా తెలియజేస్తుందని తెలిపారు. అదే విధంగా స్టార్టప్ ఆలోచనలను విజయవంతమైన వ్యాపారాలుగా ఎలా మలచుకోవాలో విద్యార్థులకు వివరణాత్మకంగా వివరించారు. ఆలోచన దశ నుంచి అమలు దశ వరకు అనుసరించాల్సిన ప్రక్రియ, వ్యూహాలు, మార్కెట్ అధ్యయనం, వినియోగదారుల అవసరాల విశ్లేషణ వంటి అంశాలను స్పష్టంగా తెలియజేశారు. థింగ్‌క్యూబేటర్ స్టార్టప్ ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులకు లభించే సాంకేతిక మార్గదర్శకత్వం, మెంటార్‌షిప్, పరిశ్రమలతో అనుసంధానం, పెట్టుబడిదారులతో కలయిక, ప్రోటోటైప్ అభివృద్ధి, ఉత్పత్తుల వాణిజ్యీకరణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఐడియా ధృవీకరణ, వ్యాపార నమూనా రూపకల్పన, మార్కెట్ విశ్లేషణ, వినియోగదారుల అభిప్రాయాల ఆధారంగా మెరుగుదల, విస్తరణ వంటి కీలక దశలను వివరించారు.

వివిధ రంగాల్లో స్టార్టప్ అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను థింగ్‌క్యూబేటర్ వేదికగా సమర్పించి, నిపుణుల మార్గదర్శకత్వంతో వాటిని సమాజానికి ఉపయోగపడే ఉత్పత్తులు, సేవలుగా మలచుకోవచ్చని తెలిపారు. కోహోర్ట్--9 ఎంపిక ప్రక్రియలో అర్హత సాధించిన ఆలోచనలకు ప్రత్యేక శిక్షణ, మెంటార్‌షిప్, సీడ్ ఫండింగ్ అవకాశాలు కల్పించబడతాయని నిర్వాహకులు వెల్లడించారు. విశ్వవిద్యాలయం విద్యార్థుల్లో ఔత్సాహిక వ్యాపార దృక్పథం, ఆవిష్కరణాత్మక ఆలోచనా శక్తి, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం ముగింపులో ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించారు. వివిధ విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా శైవాగమ ఆధ్యులు శ్రీకంఠ శివాచార్య జయంతుత్సవాలు



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): శైవాగమ ఆధ్యులు జగద్గురు శ్రీకంఠ శివాచార్య 3642వ, జయంతి ఉత్సవాలు, సహస్ర ప్రతిష్టాపనాచార్య మామిళ్ళపల్లి మృత్యుంజయ ప్రసాద్ ప్రత్యక్షపర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బుర్రిపాలేం రోడ్ లోని ఓంకార క్షేత్రంలో ఆదివారం శివాలయ ప్రతిష్టా విధానానికి ఆధ్యులైన శ్రీకంఠ శివాచార్య జయంతి ఉత్సవాలను విశేష కార్యక్రమాలతొ ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలొ, శైవాగమ విద్యా వాఛస్పతి మామిళ్ళపల్లి మృత్యుంజయప్రసాద్ దంపతులు, గురుమండలార్చన, వేదికార్చనలు, రుద్రహోమం పూర్ణాహుతి కార్యక్రమాలను విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని శివాలయాల ప్రధాన అర్చకులను సత్కరించారు. కార్యక్రమ విశిష్టతను మామిళ్ళపల్లి మృత్యుంజయ ప్రసాద్ మీడియాకు వివరించారు. ఆదిశైవ సాంప్రదాయమునకు చెందిన శ్రీకంఠ శివాచార్యులు దేశంలో వైదిక ఆదిశైవ సిద్ధాంతము ద్వారా, దేవాలయములందు, ప్రతిష్టిత లింగార్చనా విధికి ఆద్యులనిఅన్నారు. మనస్సిద్ధి యోగబలముతో, సప్త ద్వీపములలో,శివ విశిష్టాద్వైతమును ప్రచారము చేసిన మహనీయులని వర్ణించారు. శివస్వరూపులైన శివాచార్యులవారు, 300వందల సంవత్సరాలు జీవించినా, బాల రూపంతోనె, దేహత్యాగం చేసి,శివైఖ్యం చెందినట్లు ఆధారాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలొ పలు ప్రాంతాల ఆదిశైవ సంఘీయులు పాల్గొన్నారు.

# నేడు పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్), రెవెన్యూ క్లినిక్ లను ప్రజలు ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ప్రతి సోమవారం పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ లను ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించేందుకు జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. రెవిన్యూ క్లినిక్ లలో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, గుంటూరు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారులు గ్రామ స్థాయి రికార్డులతో హాజరు అవుతారని తెలిపారు. మండలాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేసి, ప్రజల నుంచి అర్జీలను నేరుగా స్వీకరించి నమోదు చేయడంతో పాటు, సమస్యల స్వరూపాన్ని బట్టి అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. అప్పటికప్పుడే పరిష్కారం చేయలేని సమస్యలను వారం రోజులలో పరిష్కారం చేయుటకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను డివిజనల్, మండల రెవిన్యూ అధికారులు సమర్పిస్తామని వివరించారు. రెవెన్యూక్లినిక్ కు నాలుగు కౌంటర్ లు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు.

**మీకోసం వెబ్ సైట్ లో అర్జీలు సమర్పించవచ్చు**

ప్రజలు తమ సమస్యలను మీకోసం వెబ్ సైట్ లోను అర్జీలు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ చెప్పారు. అర్జీల వివరాలు (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. పి.జి.ఆర్.ఎస్ ను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పి.జి.ఆర్.ఎస్ లో సమర్పించిన అర్జీల స్థితిని 1100 టోల్ ఫ్రీ ఫోన్ నంబర్ కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. అర్జీలను మీకోసం వెబ్ సైట్ లోను సమర్పించవచ్చని చెప్పారు.

# వైభవంగా శ్రీమహాసుదర్శన హోమం



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): ఏడుకొండల స్వామికి ఏడు శనివారములు సంకీర్తన గానామృత కార్యక్రమం ఐదు వారాలు పూర్తయిన సందర్భంగా, శ్రీ మహా సుదర్శన హోమ క్రతువును వైఖానస ఆగమ రీతిలో ఘనంగా ప్రారంభించారు. స్థానిక బాలాజీ రావు పేట ప్రియా డీలక్స్ ఎదుట గల నారాయణ అష్టాక్షరి క్షేత్రం ప్రాంగణంలో శనివారం సాయంత్రం శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ మహా సుదర్శన హోమ క్రతువును వేద పండితులు ప్రారంభించారు. గోవర్ధన లక్ష్మీ రాఘవరావు శిష్య బృందం ఆధ్వర్యంలో మహా సుదర్శన హోమక్రతువులొ దంపతులు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. త్రయాహిక దీక్షగా మూడు రోజులు నిర్వహించే కార్యక్రమం విశిష్టతను శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రొంపిచర్ల వెంకట కిరణ్ మీడియాకు వివరించారు. ఇక రెండవ రోజైన ఆదివారం ఉదయం సుదర్శన హోమంతో పాటుగా, లక్ష్మీ హయగ్రీవ పూజా కార్యక్రమాన్ని ఆగమోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదములు పంపిణీ చేశారు. అదేవిధంగా,పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినీ విద్యార్థులు, మంచి జ్ఞాపక శక్తితో, మెరిట్ మార్కులు సాధించేలా పరీక్షలు వ్రాయాలని, హయగ్రీవ ప్రసాదంగా పెన్నులు, పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. నెహ్రూ నికేతన్ విద్యాసంస్థల డైరెక్టర్ మురళీకాంత్ దాసరి, తెలుగుదేశం మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ పసుపులేటి త్రిమూర్తులు తదితర ప్రముఖులు అతిథులుగా పాల్గొని విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమ విశిష్టతను వివరించారు. కల్యాణ వేంకటేశ్వర ఆలయ నిర్మాణంలో, ఉడతా భక్తిగా ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలని, అందరూ ఓ పుణ్యక్షేత్రం ఏర్పాటులో వారివంతు తోడ్పడాలనె భావనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ బాధ్యులు, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందం సభ్యులు విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## సీఎంకు ఎమ్మెల్యే నసీర్ ఘన స్వాగతం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర శివారులోని శ్రీ సత్య సాయి స్పిరిచువల్ సిటీ లో గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కమ్యూనికేషన్స్ కేంద్రమంత్రి జ్యోతిరాధిత్య సింధియాకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ భారతదేశంలో డాక్ సేవలు అత్యంత విలువైనవని చెప్పారు. ప్రతి గ్రామాన్ని అనుసంధానిస్తూ ప్రజల వద్దకు పోస్టల్ సేవలను తీసుకెళుతున్న జీడిఎస్ లకు ధన్యవాదాలు చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పోస్టల్ శాఖలో టెక్నాలజీని తీసుకొచ్చిందని అన్నారు. దీని ద్వారా ప్రతి వ్యక్తికీ పోస్టల్ తో అనుసంధానం కలిగి ఉంటుందని పేర్కొన్నారు.

## సీఎంకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఘన స్వాగతం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు శ్రీ సత్యసాయి స్పిరిచువల్ సొసైటీ ,బొమ్మిడాల నగర్ లో జరిగిన గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం కార్యక్రమం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకి హెలిప్యాడ్ వద్ద గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్వాగతం పలికారు.

## నోబుల్ టీచర్స్ అసోసియేషన్‌లో చేరిన ఐఈఆర్పీ ఉపాధ్యాయులు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భవితా కేంద్రాల్లో పనిచేస్తున్న ఐఈఆర్పీ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు రాష్ట్రవ్యాప్తంగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్‌లో చేరుతున్నారు. ఈ సందర్భంగా వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు నక్కా ఆనందబాబు గుంటూరులోని తన కార్యాలయంలో ఉపాధ్యాయులకు అసోసియేషన్ సభ్యత్వ పత్రాలను అందజేసి సంఘంలోకి ఆహ్వానించారు.
ఈ సందర్భంగా ఐఈఆర్పీ ఉపాధ్యాయులు మాట్లాడుతూ, 2002 నుండి భవితా కేంద్రాల్లో సేవలందిస్తున్న తమను సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రెగ్యులర్ ఉపాధ్యాయులుగా గుర్తించి పే స్కేలు అమలు చేయాలని కోరారు. ఎంతోకాలంగా తాత్కాలిక హోదాలోనే కొనసాగుతున్నందున తమకు తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.
ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధ్యాయుల అనేక సమస్యలు పరిష్కరించబడ్డాయని, గత ప్రభుత్వ కాలంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులకు అనుకూలంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన సమస్యలన్నింటినీ పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ ఫ్. లలిత బాబు, ఐఈఆర్పీ ఉపాధ్యాయులు సుబ్బారావు, రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యం



- బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్
- బీసీ సింహగర్జన సభ

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా మార్పు కోసమే బీసీవై పార్టీ పోరాటం చేస్తుందని బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎదట బీసీవై పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ సింహగర్జన సభ నిర్వహించారు.
ఈ సందర్భంగా బోడే రామచంద్రయాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిద్ధశుద్ధి ఉంటే డ్రగ్స్ వ్యాపారంను ఆరికట్టాలని డిమాండ్ చేశారు. బీసీ, బహుజన ఉద్యోగుల దుస్థితి దారుణంగా ఉందన్నారు. ప్రశ్నిస్తే వేధింపులు పరంపరా కొనసాగుతుందని, బదిలీలు ఉంటాయని నోరు మెదపలేని పరిస్థితులు నెలకొన్నాయని రామచంద్రయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజదానిలో బీసీలకు వెయ్యి ఎకరాల భూమిని కేటాయించాలని అన్నారు. మిగిలిన సామాజిక వర్గాలు కూడ ముందుకురావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ రాజధాని అమరావతిలో సామాజిక వర్గాల వాట ఎంత అనేది తేల్చుకోవాల్సిన తరుణం అసన్నమైందన్నారు. బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఐదు న్యాయమైన బీసీ ఉద్యమ హామీలను వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు.
న్యాయమైన ఐదు డిమాండ్లను నెల రోజులలో నేరవేర్చాలని, లేకుంటే ఎప్రిల్ 11వ తేదిన విజయవాడలో అమరణ నిరాహరదీక్షకు కూర్చుంటానని బోడే రామచంద్రయాదవ్ స్పష్టం చేశారు.

## మైక్రో ఇరిగేషన్ నిధుల విడుదలపై కేంద్ర మంత్రికి మంత్రి అచ్చెన్న విజ్ఞప్తి

- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



**తిరుమల(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర వ్యవసాయం ,రైతుల సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం ఉదయం తిరుమలను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పలు ముఖ్యాంశాలపై చర్చించారు. రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమ కార్యక్రమాల అమలు, కేంద్ర పథకాల సమర్థవంతమైన అమలు వంటి అంశాలపై ఇరు మంత్రులు విస్తృతంగా అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్రంలో రైతులకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, నిధులు మరియు వివిధ పథకాల అమలుపై మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రైతుల ఆదాయవృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సాగు ఖర్చుల తగ్గింపు దిశగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతోందని కొనియాడారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరు మంత్రులు ఆకాంక్షించారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న మైక్రో ఇరిగేషన్ పథకానికి సంబంధించిన కేంద్ర వాటా నిధుల విడుదల అంశాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ప్రస్తావించారు. రాష్ట్రంలో ఇప్పటికే అమలు చేసిన పథకాల కింద కేంద్ర వాటాగా మొత్తం 695 కోట్లు రావలసి ఉందని తెలిపారు. ఈ నెలలో కేవలం 50 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని, ఇంకా 645 కోట్లు విడుదల చేయాల్సి ఉందని వివరించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మిగిలిన కేంద్ర వాటా నిధులను తక్షణమే విడుదల చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కనీసం మరో 400 కోట్లు సెంట్రల్ షేర్ నిధులు విడుదల చేయవలసిందిగా కోరారు. ఈ నిధులను ఆర్‌కేవివై – పీడీఎంసీపథకం ద్వారా మంజూరు చేయాలని మంత్రి అచ్చెన్న కోరారు. మైక్రో ఇరిగేషన్ విస్తరణ ద్వారా నీటి వనరుల సమర్థ వినియోగం, సాగు వ్యయాల తగ్గింపు, రైతుల ఆదాయవృద్ధి సాధ్యమవుతాయని మంత్రి పేర్కొన్నారు. ఈ విషయాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు, త్వరితగతిన నిధుల విడుదలకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయులతో ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావం




**తిరుపతి(జర్నలిస్ట్ ఫైల్)** తిరుపతిలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏ.పీ.ఆర్.టి.ఎఫ్) ఈరోజు తిరుపతి నగరంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి. హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్. చిరంజీవి ప్రత్యేకంగా హాజరై సంఘీభావం ప్రకటించారు. ఆ కార్యక్రమానికి ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు ఎస్. ఆనంద్ నాయుడు అధ్యక్షత వహించగా, ఉపాధ్యాయ ప్రగతి ప్రధాన సంపాదకులు జి. సత్యనారాయణ, ఐఫియా చీఫ్ ప్యాట్రాన్ కె. సుబ్బారెడ్డి, పి.టి.యల్.యఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు డి. ప్రసన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
తదనంతరం రాష్ట్ర అడహాక్ కమిటీ ఎన్నికలు నిర్వహించబడ్డాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులుగా ఏ. సదాశివరావు (విజయనగరం) కన్వీనర్, జి. చెంగలరాయ మందడి (చిత్తూరు) కో కన్వీనర్, ఏ.ఎస్. నాయుడు (విశాఖపట్నం), ఎం.వి. ప్రసాదరావు (గుంటూరు), బి. తిరుపతిరెడ్డి (నెల్లూరు), పీవీ సుబ్బారావు (ప్రకాశం), ఎస్. ఎడ్విన్ జార్జి (అనంతపురం) నియమితులయ్యారు. సమావేశంలో ప్రధానంగా ఉద్యోగ విరమణ చేసిన రోజే పెన్షన్, గ్రాట్యూటీ కమ్యుటేషన్ చెల్లింపులు జరగాలన్నది, 12వ వేతన సవరణ కమిషనర్‌ను వెంటనే నియమించి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నది, సీపీఎస్ ను రద్దు చేసి ఉపాధ్యాయులకు పాత 1980 పెన్షన్ విధానం వర్తింపజేయాలన్నది వంటి కీలక నిర్ణయాలు తీసుకోబడ్డాయి. అదనంగా 70 ఏళ్లు పూర్తి చేసిన వారికి 10 శాతం, 75 ఏళ్లు పూర్తి చేసిన వారికి 15 శాతం పెన్షన్ క్వాంటం అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ విధానానుసారం రిటైర్ అయిన ఉపాధ్యాయులకు 20 లక్షల గ్రాట్యూటీ చెల్లించాలని కమిటీ కోరింది.
ఇవ్వకమానందంగా పెండింగ్‌లో ఉన్న గ్రాట్యూటీ, లీవ్ ఎంకాష్మెంట్, 11వ పి.ఆర్.సి బకాయిలను వెంటనే మంజూరు చేయాలని, నాలుగు విడతల డియర్ నెస్ అలవెన్స్ (డీఆర్)లను తక్షణం చెల్లించాలని, రిటైర్డ్ టీచర్స్ విషయంలో ఈహెచెస్ స్కీమ్‌ను సరళతరం చేసి, ప్రభుత్వం గుర్తించిన వైద్యశాలల్లో అన్ని రకాల వైద్యం అందించాలన్నది కూడా తీర్మానించబడింది. 10వ నం. జి.వో ప్రకారం పెన్షన్ ఆన్లైన్ విధానంలో లోపాలను గుర్తించడానికి పైలెట్ ప్రాజెక్ట్ అమలు చేయాలని కూడా నిర్ణయించబడింది.
కన్వీనర్ ఏ. సదాశివరావు మాట్లాడుతూ, "రాజకీయాలు వదిలి రిటైర్డ్ ఉపాధ్యాయుల సమస్యలకు ప్రభుత్వం వెంటనే పరిష్కారం చూపాలి. వారి కష్టాలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలి" అన్నారు. కో కన్వీనర్ జి. చెంగలరాయ మందడి కూడా, "పెన్షన్, గ్రాట్యూటీ, డీఆర్ వంటి అంశాల్లో ఏవైనా ఆలస్యం కాదని, ఉపాధ్యాయుల హక్కులను రక్షించే విధంగా చర్యలు చేపట్టాలి" అని పేర్కొన్నారు. ఏ.పీ.ఆర్.టి.ఎఫ్ ద్వారా రిటైర్డ్ ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించడానికి ప్రభుత్వం ముందు అడుగు వేస్తుందని ఈ సమావేశం ద్వారా స్పష్టమైంది.

## నిమిషం ఆలస్యమైన అనుమతి నిరాకరణ : ఇంటర్ పరీక్షల్లో కఠిన నిబంధనలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ వ్యాప్తంగా ఈ నెల 23 నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ప్రారంభం కానున్నాయి. దీంతో ఇంటర్ బోర్డ్ అధికారులు కఠినమైన నిర్ణయం తీసుకున్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,537 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 10,57,312 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఇక పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. కనీసం అరగంట ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షల పారదర్శకతను కాపాడేందుకు ఎలక్ట్రానిక్ పరికరాలపై బోర్డు పూర్తిస్థాయి నిషేధం విధించారు.
మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, క్యాలిక్యులేటర్లు, ఇతర డిజిటల్ గాడ్జెట్లను పరీక్షా హాలులోకి తీసుకురావడం తీవ్ర నేరంగా పరిగణించబడుతుందని హెచ్చరించారు.. విద్యార్థులతో పాటు పర్యవేక్షణ చేసే సిబ్బందికి కూడా సెల్ ఫోన్ల అనుమతి ఉండదని, ప్రతి పరీక్షా కేంద్రంలోనూ సిసిటివి కెమెరాల నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిని నేరుగా కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షించనున్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సజావుగా పరీక్షలు నిర్వహించేందుకు రవాణా శాఖ ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నట్లు తెలిపారు.

## సీఎంకు స్వాగతం పలికిన మన్నవ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గుంటూరులోని శ్రీ సత్యసాయి స్పిరిచువల్ సొసైటీలో నిర్వహించిన గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనం కార్యక్రమానికి ఆదివారం ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి హెలిప్యాడ్ వద్ద ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా , పలువు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



- అన్ని రంగాలలో ముందంజలో భారత్
- దేశ ప్రజల అభివృద్దే లక్ష్యంగా కృషి
- బీజేపీ మైనారిటీ కోస్టల్ ఆంధ్ర జోన్ ఇంచార్జ్ డా షేక్ అబ్దుల్ ఖుద్దుస్

**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ):** భారతదేశం అభివృద్ధి కొరకు భారతీయ జనతా పార్టీ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని బీజేపీ మైనారిటీ మోర్చా ఆంధ్ర కోస్టల్ జోన్ ఇంచార్జి డా షేక్ అబ్దుల్ ఖుద్దుస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా బీజేపీ హయాంలో అనేక రకాల విప్లవత్మకమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలను దేశాన్ని అభివృద్ధి పథం లోకి తీసుకువెళ్తున్నారని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేత్రుత్వంలో భారత దేశం అన్ని రంగాలలో ముందుకు వెళుందన్నారు. ప్రధానంగా పేద ప్రజల ఆర్థికభివృద్ధి లక్ష్యంగా అనేక రకాల అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. దేశంలో క్షేత్ర స్థాయిలో ప్రజలకు సంక్షేమన్ని అందజేస్తున్నారని తెలిపారు. కుల మత బేధాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు అన్న దమ్ములు గా కలిసి మెలసి ఉంటున్నామని భారతీయులమంతా ఒకే కుటుంబం అని అన్నారు. ప్రపంచం లోనే భారతదేశం అగ్రగామి గా ఎదుగుతుందన్నారు. మోడీ నేత్రుత్వంలో రానున్న రోజులలో దేశం మరింతగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. దేశ ప్రజలందరూ భారతీయ జనతా పార్టీ కు మద్దతుగా ఉన్నారని ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసిన దేశ ప్రజల హృదయాలలో బీజేపీ పై ఉన్న అభిమానాన్ని చేరపలేరన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో ప్రజా దర్బార్లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుండి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల విజ్ఞప్తులను సావధానంగా ఆలకించిన జీవీ వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రతి ఒక్కరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం లభిస్తుందని, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం వల్ల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

## విద్యార్థి.. విజయీభవ..! నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. ఇంటర్ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా కళాశాలల యాజమాన్యం విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. పరీక్షకేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఇన్విజిలేటర్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ లను ఇంటర్ బోర్డు ఇప్పటికే నియమించింది.. పరీక్షలు జరిగే రోజుల్లో విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి. ఇందుకోసం పరీక్షల ప్రణాళికను తయారు చేసుకోవాలి. విశ్రాంతి తో పాటు, పరీక్షలు రాసే విధానంలో చక్కటి మెలుకువలు పాటిస్తే ఆయా సబ్జెక్టుల్లో పట్టు పెంచుకోవడంతో పాటు మంచి మార్కులు సాధిస్తారు. పరీక్ష సందర్భంగా ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులు కావాలని కోరుకుంటున్నాం........

నేను మీ ఇంటర్ పరీక్షను. మిమ్మల్ని నేడు కలుసుకోబోతున్నందుకు ఆనందంగా ఉంది. ప్రతి ఏటా మార్చిలో మిమ్మల్ని మిమ్ముల్ని కలుస్తున్నా.. నాకు ఎంతో ఆనందంగా ఉంది.... ప్రతి ఒక్కరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని నేను కోరుకుంటున్నాను. అధికారులు సైతం పరీక్షలకుఅన్ని ఏర్పాట్లు చేశారు. ఇక మీ రాక కోసం ఎదురు చూస్తున్నా. మరి మీరు కూడా సిద్ధమే కదా? ఇప్పటికీ ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయ్యాయి. థియరీ పరీక్షలకు సంబంధించి కళాశాలల ప్రిన్సిపాల్ విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఇంటికి గడప ఎంత ముఖ్యమో మీ ఉన్నత చదువులకూ నేను అంతే అవసరం. పరీక్షల టైంలో నిర్లక్ష్యాన్ని వీడండి.. భయాన్ని పారదోలండి. సత్ఫలితాలను ఆశించండి. నేను చెప్పే కొన్ని సూచనలు పాటించి పరీక్షల్లోవిజయంసాధించండి. పరీక్షలు రాసి విద్యార్థులకునిద్ర..ఆహారపుఅలవాట్లు కీలకమనే విషయాన్నీగుర్తుంచుకోండి



ప్రణాళిక ప్రకారంగా చదివితేనే ప్రయోజనం ఉంటుంది. ఉదయం 4 నుంచి 6 గంటల వరకు మనసు ప్రశాంతంగా ఉంటుందని.. చదివిన అంశాలు ఎక్కువ గుర్తుంటాయని విద్యా నిపుణులుసూచిస్తుంటారు ఈసమయాన్ని సద్వినియోగం చేసుకోండి. కొందరు పరీక్ష ముందు రోజు రాత్రి సమయంలోనిద్రపోకుండాచదువుతుంటారు. ఇలా చేస్తే మర్నాడు పరీక్ష సరిగా రాయలేరు. పరీక్షల సమయంలో ప్రతిరోజు చదివేంత ముఖ్యమో పరీక్ష రాయాలంటే విశ్రాంతి కూడా అంతే ముఖ్యం ప్రతిరోజు 7–8 గంటల వరకు నిద్రకు కేటాయించాలి. వెంటవెంటనేరకరకాలసబ్జెక్టులనుచదవకూడదు. పరీక్షలు ముగిసే వరకు ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలి. కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండడం మంచిది. ఈ పరీక్ష జరిగే రోజుల్లో పాఠ్యాంశాలపై ఏకాగ్రత పెంచుకోవాలి. వినోదాలకు దూరంగాఉండాలి. ఏకాగ్రతతో చదివితే మంచిమార్కులు సాధించేందుకుఆస్కారంగా ఉంటుంది.

**మానసిక ప్రశాంతత.. ఆత్మవిశ్వాసం అవసరం :** మీరు మొదటిసారిగా ఇంటర్ బోర్డు పరీక్షలను ఎదుర్కోవడం కొంత కష్టంగానే ఉంటుంది. అవగాహన లేమి, ఆందోళన ఇతరత్రా కారణాలు మిమ్ముల్ని వేధిస్తుంటాయి. ప్రశ్నపత్రం ఎంత కఠినంగా వస్తుందో, ఎలా రాయాలో, తక్కువ మార్కులు వస్తే చదువులో వెనుకబడి పోతామేమో అనే ప్రశ్నలు ఆందోళనకు గురి చేస్తుంటాయి. వీటి గురించి ఆలోచించకండి.. పరీక్ష బాగా రాయగలను అనే పాజిటివ్ దృక్పథంతో ఉండండి మనసును ప్రశాంతంగా ఉంచుకుంటే ఎలాంటి భయాలూ ఉండవు. కొందరు పరీక్షకు వెళ్లే క్రమంలో బస్సుల్లోనో, ఆటోల్లోచదువుతుంటారు. ఇలా చేయడం సరికాదు. పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగా చేరుకునేలా ప్రణాళిక చేసుకోవాలి.
పరీక్షల్లో జవాబు పత్రాలపై లైన్లో చక్కగా ఉండి చక్కని చేతిరాత కనిపించాలి ఆంగ్ల మాధ్యమంలో కానీ, తెలుగులో కానీ చక్కటి వాక్య నిర్మాణం ఉండాలి. ప్రశ్నకు తగ్గట్లు జవాబులు అర్థవంతంగా, చిన్న చిన్న వాక్యాల నిర్మాణంతో ఉండాలి. రిపీట్ వాక్యాలు ఉండకూడదు. మీరు రాసే జవాబులు అర్థవంతంగా ఉంటే మార్కులు కూడా బాగా వేయటానికి అవకాశం ఉంటుంది. మీరు రాసే జవాబులు ప్రశ్నాపత్రాలను మూల్యాంకనం చేసే లెక్చరర్ కు అర్థమయ్యేలా ఉండాలి. ఇంగ్లీష్ పదాల్లో తప్పులు ఉండకూడదు. స్టోరీలను చక్కగా పేరాలుగా విభజించి రాయాలి. రెండు మార్కుల ప్రశ్నలు ఉంటే క్రుప్తంగా రాయాలి. ప్రతి జవాబుకు జవాబు మధ్య గ్యాప్ ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా బైపిసి, ఎంపీసీ విద్యార్థులు అవసరమైన ప్రశ్నలకు జవాబులు రాయడంతో పాటు తగ్గట్లు చిత్రపటాలు ఉంటే పెన్సిల్, స్కెచ్ పెన్సిల్ ను ఉపయోగించి చక్కటి చిత్రపటాలు గీయాలి.. కెమిస్ట్రీ, ఫిజిక్స్ పరీక్షల్లో జవాబులు రాసేటప్పుడు పలు జాగ్రత్తలు పాటించాలి. ఈ రెండు సబ్జెక్టుల్లో కొన్ని లెక్కలు కూడా ఉంటాయి కనుక లెక్కలు చేసేటప్పుడు కచ్చితంగా సూత్రాలను ఉపయోగించాలి. కెమిస్ట్రీలో ఆర్గానిక్ ప్రశ్నలకు జవాబులు రాసేటప్పుడు ఫార్ములాలు రాయాలి. ఈక్వేషన్స్ ఉన్నచోట తప్పకుండా తప్పులు లేకుండా వాటిని జవాబుతో పాటు పొందుపరచడం ఎంతో ముఖ్యం. ఈక్వేషన్ చూస్తేనే మీకు ఇచ్చిన ప్రశ్నకు సమాధానం కరెక్టుగా రాశారా లేదా అనే విషయం తెలిసిపోతుంది. సాధ్యమైనంత వరకు ప్రశ్నాపత్రంలో ఉన్న ప్రశ్నలకు అదే సీరియల్ లో సమాధానాలు రాస్తే చాలా మంచిది. అలా రాయటం అనేది మీ యొక్క జ్ఞాపకశక్తిని సూచిస్తుంది. అంతేకాకుండా జవాబుల పత్రాలు వాల్యూ చేసి ఉపాధ్యాయుడికి మీపై మంచి అభిప్రాయం ఏర్పడి మార్కులు కూడా మంచిగా వేయటానికి అవకాశం ఉంటుంది.
ఇదిలా ఉండగా విద్యార్థులు చదువుకునేటప్పుడు కొన్ని అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. సంవత్సరం పొడుగునా పాఠ్యాంశాలలోని ప్రశ్నలన్నింటికీ జవాబులు భట్టి పెట్టే విద్యార్థులు పరీక్ష ముందు రోజు మాత్రం పాఠ్యాంశాల్లో పరీక్షలకు ఇచ్చే మార్కుల వెయిటేజీ ఆధారంగా జవాబులు చదువుకుంది చక్కటి ఫలితం ఉంటుంది.
ఇంటర్ పరీక్షల్లో ప్రతి ప్రశ్నపత్రంలో ఆయా సబ్జెక్టుల్లో పాఠ్యాంశాలకు అనుగుణంగా మార్కుల వెయిటేజీ ఉంది. ఏ పాఠ్యాంశంలో ఇన్ని మార్కులకు ప్రశ్నలు వస్తాయో వెయిటేజీ ఉంది. దీని ప్రకారం ప్రిపేర్ అయితే మంచి మార్కులు . సిలబస్ కూడా డెబ్బై శాతం నిర్ణయించడం, ఛాయిస్ ప్రశ్నలు ఎక్కువ వచ్చే అవకాశముంది. ఇంత చక్కని అవకాశాన్ని మీరందరూవినియోగించుకోవాలి. రాసే ప్రతి అంశాన్ని పాయింట్ల వారీగా చక్కని చేతిరాత ఉంటే మంచి మార్కులు సాధించొచ్చు. పరీక్షల సమయంలో పునశ్చరణపైనే దృష్టి సారించండి. కొత్త అంశాలు చదవాలని ప్రయత్నించకండి. ఇలా చేస్తే అయోమయానికి గురవుతారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467